Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 166 విశాఖపట్నం, 12 ఏప్రిల్ 2025 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



## వారికి కుటుంబ ప్రయోజనాలే ముఖ్యం

- ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ధ్వజం
- వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన

**వారణాసి:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై విరుచుకు పడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఫూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో శుక్రవారం రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' (కుటుంబంతో కలిసి.. కుటుంబం కోసం) అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' (అందరితో కలిసి..అందరి కోసం) నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ ...(మిగతా 2లో)

# టీడీపీకి బీసీలే వెన్నెముక



- ఏపీ సీఎం చంద్రబాబు



**ఆగిరిపల్లి, విశాఖ సమాచారమ్ :** టీడీపీకి మొదటి నుంచీ వెన్నెముక బీసీ వర్గాలేనని పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తనతో పాటు ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలిసి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో బీసీ వర్గాలతో నిర్వహించిన ప్రజావేదికలో సీఎం మాట్లాడారు. 'బీసీలకు కార్పొరేషన్లు పెట్టి ఆయా వర్గాలకు మేలు చేస్తున్నాం. ఎన్టీఆర్ హయాంలో బీసీ గురుకులాలు వచ్చాయి. విదేశాల్లో చదువుకునే వారికి రూ.15లక్షల సాయం అందిస్తున్నాం. సివిల్స్, గ్రూప్స్ రాసేవారికి అండగా ఉన్నాం. అమరావతిలో సివిల్స్ కోచింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. బ్యాచ్‌కు 500 మందికి చొప్పున శిక్షణ ఇస్తాం. ఆదరణ-3 కింద ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. నేతన్నలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం. ఇల్లు కట్టుకునే వెనుకబడిన వర్గాలకు అదనంగా రూ.50వేలు ఇస్తాం. ఎస్సీల ఇళ్లకు ఉచితంగా సోలార్ ప్యానల్స్ మంజూరు చేస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు.

### వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరి రోజు

"త్వరలో బీసీ సంరక్షణ చట్టం తీసుకొస్తాం. టీడీపీ వచ్చాకే వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగింది. ఉద్యోగాల్లో 33, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాం. జిల్లాల వారీగా బీసీ భవనాలకు శ్రీకారం చుట్టాం. మా ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత.. వెనుకబడిన వర్గాల సంక్షేమమే. అమరావతిలో సివిల్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు ఇస్తున్నాం. ఈ ఏడాది లక్ష మంది మహిళలను ...(మిగతా 2లో)



## కనులపండువగా రాములోరి కల్యాణం

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ముగిసిన వేడుక

పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

**ఒంటిమిట్ట, విశాఖ సమాచారమ్ :** ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శుక్రవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జగత్కల్యాణం ఘట్టాన్ని పండు వెన్నెల్లో కనులపండువగా టీటీడీ ఆధ్వర్యంలో దిగ్విజయంగా నడిపించారు. ఆలయ పురోహితులతో పాటు తిరుమల నుంచి వచ్చిన వేద పండితులు ఈ క్రతువును జరిపించారు. కోదండ రామాలయంలో శుక్రవారం మధ్యాహ్నం కాంత కోరిక, ఎదుర్కోలు ఉత్సవం, శోభాయాత్ర 3.15 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణ క్రతువును సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 వరకు జరిపించారు. సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ...(మిగతా 2లో)





## నేడు ఇంటర్ ఫలితాలు వెల్లడి

**అమరావతి, విశాఖ సమాచారమ్ :** ఏపీలో ఇంటర్మీడియట్ ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ ద్వారా తెలిపారు. మొదటి రెండు సంవత్సరాల ఫలితాలు విడుదల కానున్నాయి. విద్యార్థులు ఫలితాలను resultsbpi.ap.gov.inలో తెలుసుకోవచ్చును. అదేవిధంగా వాట్సాప్ ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చని సూచించారు. 9552300009 నంబర్‌కు హాయ్ అని పెడితే రిజల్ట్స్ తెలుస్తాయి. పరీక్ష రాసిన విద్యార్థులందరికీ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు పడిన శ్రమకు ఈ ఫలితాలు ప్రతిబింబిస్తాయి అని ఆయన పేర్కొన్నారు.

## విశాఖ నుంచి విమాన సర్వీసులు ఎగిరిపోతున్నాయ్!



- ప్రయాణికుల ఆందోళన
- కేంద్ర మంత్రి దృష్టి సారించాలని విజ్ఞప్తి

**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్ :** గత కొంతకాలంగా ఆర్థిక రాజధాని విశాఖ నుంచి కీలక సర్వీసులు ఒక్కొక్కటిగా నిలిచిపోనున్నాయి. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడకు రెండు సర్వీసులు ఇప్పటికే నిలిచిపోయాయి. ఇక్కడి నుంచి కడపకు నేరుగా నడిచే ఇండిగో విమాన సర్వీసును కొన్ని నెలలుగా నిలిపేశారు. మేలో బ్యాంకాక్ (థాయ్‌లాండ్), కౌలాలంపూర్ (మలేసియా) సర్వీసులూ రద్దు కానున్నాయి. కొవిడ్ సమయంలో నిలిచిపోయిన దుబాయి సర్వీసు ప్రారంభం కాకపోగా.. ఉన్నవీ రద్దవడంతో స్థానిక పారిశ్రామికవేత్తలు, నాయకులు, వివిధ వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టి సారించాలని కోరుతున్నారు.

### ఇలా అయితే ఇక్కట్లే..

విశాఖ విమానాశ్రయం నుంచి బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకు నేరుగా విమాన సర్వీసులు గతేడాది ఏప్రిల్‌లో ప్రారంభమయ్యాయి. ...(మిగతా 2లో)



హోం మంత్రి అనిత 'మార్నింగ్ వాక్' కార్యక్రమానికి విశేష స్పందన

ఆత్మీయ పలకరింపులతో పరవశించిన వేంపాడు వాసులు

## సమస్యలు వింటూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ..

**అనకాపల్లి, విశాఖ సమాచారమ్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడులో హోం మంత్రి వంగలపూడి అనిత మార్నింగ్ వాక్ చేస్తూ గ్రామస్తులతో ముచ్చటించారు. ఆమె వెంట గ్రామస్తులు అడుగులో అడుగు కలిపారు. అనంతరం వేంపాడులో ఎన్టీఆర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాకింగ్ చేస్తూనే ప్రజల యోగక్షేమాలు ...(మిగతా 2లో)



## తగ్గేదేలా అంటున్న చైనా

అమెరికాపై సుంకాలు 125 శాతానికి పెంపు



**బీజింగ్:** అమెరికా, చైనా ల మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులను డ్రాగన్ ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యూఎస్ 145 శాతానికి పెంచితే.. డ్రాగన్ నుంచి అదే రియాక్షన్ వచ్చింది. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచింది. చైనాపై విధించిన సుంకాలను మొత్తంగా లెక్కిస్తే 145శాతంగా ఉంటాయని గురువారం శ్వేతసౌధం కార్యనిర్వాహక ఉత్తర్వు వెల్లడించింది. ఈ నేపథ్యంలో తాము విధించిన 84 శాతం సుంకాలను 125 శాతానికి పెంచుతూ తాజాగా చైనా ప్రకటించింది. శనివారం నుంచి ఇవి అమల్లోకి వస్తాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనిని ఒక నంబర్ గేమ్‌గా అభివర్ణించిన మంత్రిత్వ శాఖ.. ఆర్థికంగా ఎలాంటి ప్రభావం ఉండదని వ్యాఖ్యానించింది. ఈ తతంగమంతా ఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెప్పింది. చైనా వస్తువులపై ...(మిగతా 2లో)

హాస్టల్ విద్యార్థులతో కలెక్టర్ సహపంక్తి భోజనం
2
అభివృద్ధి హబ్‌గా పాయకరావుపేట నియోజకవర్గం

## విజయవాడ మెట్రో ప్రాజెక్టు భూసేకరణకు చర్యలు



**అమరావతి, విశాఖ సమాచారమ్:** విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు రూపకల్పనకు గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో అవసరమైన భూసేకరణకు సంబంధించిన అంశాలపై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గన్నవరం, కేసరపల్లిలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారులతో కలిసి విజయవాడ మెట్రో చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ జీపీ. రంగారావు పర్యటించారు. బస్టాండ్, హెచ్‌సీఎల్, కేసరపల్లి కూడలిలో 12:42 మీటర్ల నిష్పత్తితో నిర్మించనున్న మెట్రో స్టేషన్‌లకు అవసరమైన భూసేకరణపై సమాలోచనలు చేశారు. ప్రాజెక్టు మొదటి కారిడార్‌లో 26 కిలోమీటర్ల మేర మెట్రో నిర్మాణాన్ని ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్ పీఎన్‌బీఎస్ నుంచి గన్నవరం వరకు ఉంటుంది.

## ఒంటిమిట్ట శ్రీ సీతారామ లక్ష్మణులకు స్వర్ణ కిరీటాలు



**ఒంటిమిట్ట, విశాఖ సమాచారమ్:** ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయానికి సుమారు రూ.6.60 కోట్ల విలువైన మూడు వజ్రాలు పొదిగిన స్వర్ణ కిరీటాలను, పెన్నా సిమెంట్స్ అధినేత శ్రీ ప్రతాప్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం విరాళంగా అందించారు. 7 కేజీల బంగారంతో తయారు చేసిన ఈ స్వర్ణ కిరీటాలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావులకు దాత అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఈ కిరీటాలను శ్రీ సీతారామ లక్ష్మణుల మూలమూర్తులకు అలంకరించారు.

# కులవృత్తిదారుల ఇళ్లకు వెళ్లిన చంద్రబాబు



**ఆగిరిపల్లి, విశాఖ సమాచారం:** ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో సీఎం చంద్రబాబు పర్యటించారు. మహాత్మా జ్యోతిరావు ఫులే జయంతి కార్యక్రమంలో భాగంగా సీఎం అక్కడికి వెళ్లారు. గ్రామంలో కులవృత్తులు చేసుకునేవారి ఇళ్లకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నక్కబోయిన కోటయ్య ఇంటితో పాటు ఆయన పశువుల పాకను పరిశీలించారు. అనంతరం బీసీ వర్గానికి చెందిన బత్తుల జగన్నాథం క్షౌరశాలను చంద్రబాబు పరిశీలించి ఆయనతో మాట్లాడారు. జగన్నాథం ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అత్యాధునిక పరికరాలతో కూడిన కిట్‌ను ఆయనకు సీఎం బహూకరించారు. అనంతరం ఆగిరిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ప్రజావేదిక వద్దకు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. మహాత్మా జ్యోతిబా ఫులే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత అక్కడ వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. మంత్రి పార్థసారథి ఆధ్వర్యంలో యాదవ సంఘం నేతలు సీఎంకు గొర్రె పిల్లను బహూకరించారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద సీఎంకు మంత్రులు పార్థసారథి. సవిత, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. సీఎంను చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.





# అభివృద్ధి హబ్‌గా పాయకరావుపేట నియోజకవర్గం

## - హోం మంత్రి వంగలపూడి అనిత

**పాయకరావుపేట, విశాఖ సమాచారమ్:** రానున్న పది సంవత్సరాల్లో పాయకరావుపేట విశాఖ, గాజువాక తరహాలో అభివృద్ధి చెందబోతుందని, అనకాపల్లి జిల్లాలో అత్యధిక వనరులు ఉన్న నియోజకవర్గం పాయకరావుపేట అని హెూం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహంలో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో హెూం మంత్రి సమీక్ష నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మంత్రి అనిత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఆయన నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గానికి బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్ ప్లాంట్ వంటి ప్రధాన పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు. బల్క్ డ్రగ్ ప్రాజెక్టు పూర్తి అయితే రూ. 11 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, దీంతో యువతకు భారీగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు రూ.1500 కోట్లతో పాయకరావుపేట అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టును 'జీవనాడి'గా పేర్కొంటూ, పోలవరం పనులు త్వరలో పూర్తి అవుతాయన్నారు. గత ఐదేళ్లలో ఇరిగేషన్ రంగం తీవ్రంగా గాడితప్పిందని చెప్పారు. ఇప్పుడు 2047 విజన్‌కు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, త్వరలో ఇంటింటికి కులాయి ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం అని మంత్రి అనిత తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులతో కలెక్టర్ సహపంక్తి భోజనం



**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఇసుకతోట బీసీ హాస్టల్ విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మహనీయుని స్ఫూర్తిని కాపాడుతూ ఒక తీపి గుర్తుగా ఉండాలనే ఉద్దేశంతో మీ అందరితో కలిసి భోజనం చేశానని విద్యార్థులతో అన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి, పేద ప్రజల సంక్షేమనానికి పూలే విశేషమైన సేవలందించారని.. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, సమాజ సేవ చేయాలని హితవు పలికారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని, ఏమైనా అవసరాలు ఉంటే బీసీ సంక్షేమ అధికారిణి ద్వారా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి నాగలక్ష్మి, సహాయక బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

# వేసవి రద్దీ దృష్ట్యా తిరుపతికి 14 ప్రత్యేక రైళ్లు

**సికింద్రాబాద్, విశాఖ సమాచారమ్:** వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. తిరుపతి - మచిలీపట్నం- తిరుపతి మధ్య 14 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 13 నుంచి మే 25 వరకు ప్రతి ఆదివారం తిరుపతి- మచిలీపట్నం రైలు (07121)టీ ఏప్రిల్ 14వ తేదీ నుంచి మే 26వరకు ప్రతి సోమవారం మచిలీపట్నం- తిరుపతి (07122) మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి.

తిరుపతి-మచిలీపట్నం ప్రత్యేక రైలు (07121) ప్రతి ఆదివారం రాత్రి 10.20 గంటలకు తిరుపతిలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు మచిలీపట్నం చేరుకోనుంది. అలాగే, మచిలీపట్నం-తిరుపతి ప్రత్యేక రైలు (07122) ప్రతి సోమవారం సాయంత్రం 5.40 గంటలకు మచిలీపట్నంలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3.20 గంటలకు తిరుపతికి చేరుకోనుంది. ఇరువైపులా రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, పెడన స్టేషన్లలో ఆగే ఈ ప్రత్యేక రైళ్లలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్‌తో పాటు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**చర్లపల్లి-శ్రీకాకుళం వేళలివే..**

అలాగే, చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్డు మధ్య మొత్తం 24 సర్వీసులు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఏప్రిల్ 11 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్డు రైలు (07025)టీ ఏప్రిల్ 12వ తేదీ నుంచి జూన్ 28 వరకు ప్రతి శనివారం శ్రీకాకుళం రోడ్డు- చర్లపల్లి (07026) మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. చర్లపల్లిలో ప్రతి శుక్రవారం రాత్రి 9.15 గంటలకు బయల్దేరనున్న రైలు (07025) మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. అలాగే, ప్రతి శనివారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరనున్న రైలు (07026) మరుసటి రోజు ఉదయాన్నే 6 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇరువైపులా నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురపల్లి స్టేషన్లలో ఈ రైళ్లు ఆగుతాయి. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

# వారికి కుటుంబ ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండిరటితో ముందుకువెళ్తోందని పేర్కొన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు.

# తగ్గేదేలా అంటున్న చైనా

(మొదటి పేజీ తరువాయి)

విధించిన పరస్పర సుంకాలను తొలగించే దిశగా అమెరికా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఇకనుంచి యూఎస్ వేసే టారిఫ్‌లను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసింది. వాషింగ్టన్ సుంకాలపై బీజింగ్ ప్రపంచ వాణిజ్య సంస్థలో దావా వేయనున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా విధించిన సుంకాలపై చైనా ప్రజల్లో ఆందోళనలు నెలకొన్నాయి. అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలు ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. సుంకాలపై అమెరికాతో తీవ్రంగా తలపడుతున్న చైనా కాస్త వెనక్కి తగ్గిన సంగతి తెలిసిందే. బెదిరింపులకు తలొగ్గబోమంటూనే చర్చలకు సిద్ధమని ప్రకటించింది. అమెరికా సుంకాల యుద్ధమే చేయాలనుకుంటే.. తుదివరకూ తామూ పోరాడతామని చైనా వాణిజ్యశాఖ అధికార ప్రతినిధి యాంగ్‌కియాన్ పేర్కొన్నారు. 'చైనాతో డీల్ చేయాలంటే.. ఒత్తిళ్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిళ్లు సరైన మార్గం కాదు. రెండు దేశాలు కలిసి కూర్చుని విభేదాల పరిష్కారానికి కృషి చేస్తాయని ఆశిస్తున్నాం. పరస్పర గౌరవం అనే సిద్ధాంతాల ఆధారంగా చర్చలు జరగాలి' అని యాంగ్‌కియాన్ అన్నారు.

**ట్రంప్ టారిఫ్‌ల వేళ.. జిన్‌పింగ్ ఫస్ట్ రియాక్షన్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై టారిఫ్‌ల మోత మోగిస్తున్నారు. ఈనేపథ్యంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తొలిసారి స్పందించినట్లు డ్రాగన్ ప్రభుత్వ మీడియా సంస్థ జిన్హువా పేర్కొంది. అమెరికా విధించిన 145 శాతం సుంకాలను ఏకపక్ష బెదిరింపుగా జిన్‌పింగ్ అభివర్ణించారు. బెదిరింపులను ప్రతిఘటించడానికి ఐరోపా యూనియన్ తమతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. చైనా, యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాల్సి ఉందన్నారు. అప్పుడే తమ సొంత చట్టబద్ధ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి వీలవుతుందన్నారు. అంతేగాకుండా అంతర్జాతీయ పారదర్శకత, న్యాయాన్ని కాపాడొచ్చని చెప్పారు. బీజింగ్‌లో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో భేటీ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఏపీకి చల్లని కబురు

## వారం రోజుల పాటు తేలికపాటి వర్షాలు!

**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** ఏపీలో ఎండలు మండిపోతు న్నాయి. ఈ సమయంలో విశాఖ వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. రాష్ట్రంలో వారం రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడిరచింది. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాజస్థాన్-కోస్తాంధ్ర మధ్య ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. హిమాలయ ప్రాంతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు మరో ద్రోణి విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో రాగల వారం రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా, గురువారం కురిసిన వర్షాలకు ప్రకాశం జిల్లా కురిచేడు, మర్రిపూడి, గిద్దలూరు, పాముూరు, దర్శి, పొదిలి మండలాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దర్శి మండులం చందలూరు, వెంకటచలంపల్లి, మారెడ్డిపల్లి, బసిురెడ్డిపల్లి, అబ్బాయిపాలెం, మల్లవరం, చిదంబరంపల్లి, గొల్లపల్లి, కుంచేపల్లి పాములపాడు గ్రామాల్లో బొప్పాయి తోటలకు తీవ్రనష్టం వాటిల్లింది. మిరప, పొగాకు పంటలు దెబ్బతిన్నాయి. తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో భారీ వర్షం కురిసింది.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నేడు సెలవు రద్దు

**అమరావతి, విశాఖసమాచారం :** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం సెలవు రద్దు చేసింది. రెండో శనివారం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉంటుంది. కానీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు యథావిధిగా పని చేస్తాయి. రెండో శనివారం వర్కింగ్ డేగా ప్రకటిస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మెమో జారీ చేసింది. ఈ నేపథ్యంలో రేపు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేయనున్నాయి. హాలిడే సమయాల్లో రూ. 5వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. అయితే ఈ శనివారం మాత్రం రూ. 5వేలు తీసుకోకుండానే రిజిస్ట్రేషన్లు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.

# టారిఫ్‌లకు బ్రేక్.. సూచీలు రయ్ రయ్..

**ముంబయి:** ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లకు 90 రోజుల పాటు బ్రేక్ వేస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మన మార్కెట్లు నేడు దూసుెళ్లాయి. అమెరికా, చైనా మధ్య ఓ వైపు సుంకాల పోరు కొనసాగుతున్నా.. మన మార్కెట్లు మాత్రం భారీ లాభాల్లో ముగి యడం గమనార్హం. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ప్రధాన సూచీలు బలంగా పుంజుకొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 22,800 స్థాయిని దాటింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.7.72 లక్షల కోట్లు పెరిగి రూ.401.54 లక్షల కోట్లకు చేరింది. ఆసియా, జపాన్ మార్కెట్లు నష్టాలు చవిచూడగా.. షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు లాభాల్లో ముగియడం గమ నార్హం. ట్రంప్ విరామ ప్రకటనతో మరుసటి రోజే మన సూచీలు దూసుకెళ్లాల్సి ఉన్నా.. మహవీర్ జయంతి కారణంగా నిన్న మార్కెట్లు పనిచేయలేదు. దీంతో ఈ ఉదయం అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సం కేతాలు ఉన్నప్పటికీ సూచీలు లాభాల్లో ప్రారంభం అయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 74,835.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,847.15) దాదాపు వెయ్యి పాయింట్ల లాభంతో ప్రారంభ మైంది. ఇంట్రాడేలో 75,467.33 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1310.11 పాయింట్ల లాభంతో 75,157.26 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 429.40 పాయింట్ల లాభంతో 22,828.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.86.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ షేర్లు రాణిం చాయి. ఫార్మా, మెటల్ స్టాక్స్ ప్రధానంగా రాణించాయి. అం తర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం దూసుకెళుతోంది. ఔన్సు 3248 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**కారణాలు ఇవీ..**

భారత్ సహా 75 దేశాలపై విధించిన టారిఫ్‌లను ట్రంప్ 90 రోజుల పాటు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించడం మన మార్కెట్లకు ఊరటనిచ్చింది. వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో ఈ ప్రకటన మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. డాలరు విలువ క్షీణించడం కూడా భారత్ వంటి అభివృద్ధి చెందు తున్న మార్కెట్లకు ప్రయోజన కరమని నిపుణులు చెబు తున్నారు. డాలర్ ఇండెక్స్ తాజాగా 100 దిగువకు చేరింది. నిఫ్టీ మెటల్ ఇండెక్స్ (4 శాతం), నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ (3 శాతం)తో పాటు నిఫ్టీ ఆటో, హెల్త్‌కేర్, ఫైనాన్షియల్, ఐటీ తదితర రంగాల షేర్లు రాణిం చడం కూడా మార్కెట్ల దూకుడుకు కారణమయ్యాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర 63 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇదో పాజిటివ్ అంశమని అనలిస్టులు చెబుతున్నారు.

# టీడీపీకి బీసీలే వెన్నెముక

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యం. త్వరలోనే అందరికీ తల్లికి వందనం ఇస్తాం. రైతులకు అండగా ఉంటాం.. వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తాం. కోర్టు సమస్యలు పరిష్కరించి త్వరలోనే చింతలపూడి పూర్తి చేస్తాం. మే నెల నుంచి రైతులకు విడతల వారీగా రూ.20వేలు అందిస్తాం. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరి రోజు అవుతుంది. తప్పులు చేసేవారి పట్ల చండశాసనుడిగా ఉంటా. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది. అర్హులందరికీ స్థలం ఇచ్చి ఇళ్లు కట్టాకే మళ్లీ ఓట్లు అడుగుతాం" అని చంద్రబాబు అన్నారు.



# విశాఖ నుంచి విమాన సర్వీసులు ఎగిరిపోతున్నాయ్!

(మొదటి పేజీ తరువాయి)

వారంలో మూడేసి రోజులు ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. కంబోడియా, చైనా, హాంకాంగ్, ఇండోనేసియా, జపాన్, లావోస్, మకావ్, ఫిలిప్పీన్స్, తైవాన్, వియత్నాం, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళ్లేవారికి ప్రయోజనం కలుగుతుంది. ఆక్యుపెన్సీ తక్కువగా ఉన్న కారణంగా జనవరిలో కౌలాలంపూర్ సర్వీసును నిలిపివేయాలని ఆ సంస్థ భావించగా.. కేంద్ర మంత్రి చొరవతో సేవలు కొనసాగించారు. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది అదే నెలలో అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 74.4 శాతం పెరిగింది. 8,415 మంది మలేసియా, కౌలాలంపూర్, సింగపూర్‌కు రాకపోకలు సాగించారు. తాజాగా మే మొదటి వారం నుంచి ఈ సర్వీసులకు టికెట్ల బుకింగ్ నిలిపివేశారు. ఇక్కడి నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. అంతర్జాతీయ సర్వీసులు నిలిచిపోతే వారంతా హైదరాబాద్, చెన్నై వెళ్లి.. అక్కడి నుంచి బ్యాంకాక్, మలేసియాలకు ప్రయాణించాలి.

**కడప సర్వీసు రద్దు.. విజయవాడకు ఒక్కటే!**

విశాఖ, విజయవాడ మధ్య రాకపోకలు పెరిగిన నేపథ్యంలో గతేడాది అక్టోబరులో రెండు కొత్త సర్వీసులు ప్రారంభించారు. దీంతో ప్రతిరోజు నేరుగా విజయవాడ వెళ్లేందుకు ఉదయం రెండు, సాయంత్రం ఒక సర్వీసు అందుబాటులో ఉండేవి. తాజాగా ఉదయం సర్వీసులు రద్దయ్యాయి. మిగిలిన రోజుల్లో విజయవాడకు రాకపోకలు సాగించేందుకు వందే భారత్ రైలు అందుబాటులో ఉంది. మంగళవారం వందేభారత్ కూడా లేకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కడపకు నేరుగా విమానం నడిచే సమయంలో కేవలం గంట వ్యవధిలో వెళ్లేవారు. ఆ సర్వీసును రద్దుచేశారు. ఈ విషయాన్ని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు విజయ్‌మోహన్, నరేశ్‌కుమార్.. కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# సమస్యలు వింటూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ..

(మొదటి పేజీ తరువాయి)

అడిగి తెలుసుకున్నారు. మంగళ హారతితో హోం మంత్రికి పలువురు మహిళలు స్వాగతం పలికారు. మార్నింగ్ వాకింగ్ చేస్తూ గ్రామస్తుల సమస్యలను హెూంమంత్రి తెలుసుకోవడంపై గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తుల వినతిమేరకు వేంపాడు రామాలయం వీధిలో వెంటనే సీసీ రోడ్డు వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలు కొన్ని సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు ప్రధాన సమస్యలుగా గుర్తించామని, గ్రామాల్లో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తున్నామని,15 రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. త్వరలో ఇంటింటికి కులాయి ఇవ్వబోతున్నామని మంత్రి చెప్పారు.

# కనులపండువగా రాములోరి కళ్యాణం



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. రామయ్య క్షేత్రం, కల్యాణ వేదిక ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రామాలయాన్ని విద్యుత్తు దీప కాంతులు, పుష్పాలంకరణతో సుందరంగా అలంకరించారు. సీతారాముల పెళ్లి వేడుక జరిగే ప్రాంతం కొంగొత్త శోభతో దేదీప్యమానంగా ప్రకాశించింది. గ్యాలరీలు, బారికేడ్లు, ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. సీటతారాముల కల్యాణాన్ని తిలకించడానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు రెండేసి పొట్లాలు ముత్యాలు, తిరుమల శ్రీవారి లడ్డూ (175 గ్రాములు), పసుపు, కుంకుమ, కంకణం, కారాలు, బిస్కెట్లు, అన్నప్రసాదం అందజేశారు. కల్యాణోత్సవం సందర్భంగా ఒంటిమిట్ట మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. కడప నుంచి వచ్చే వాహనాలను సిద్దవటం మండలం ఉప్పరపల్లి సాయిబాబా ఆలయం నుంచి ముమ్మడిగుంట్లపల్లి, మోహిద్దీన్‌సాహెబ్‌పల్లి మీదుగా, రాజంపేట నుంచి వస్తున్న వాటిని చెరువు కట్ట మలుపు నుంచి సాలాబాద్ మీదుగా పంపించారు.

**శివధనుర్భంగాలంకారంలో రాములవారి రాజసం**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండ రాముల వారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజన, కోలాటాలతో స్వామివారిని కీర్తి స్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వయంవరం సమ యంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తుచేసేది శివధనుర్భంగాలంకారం. సీతారాముల కల్యాణం రోజున ఉదయం ఈ అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు.



# సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించిన ఎక్సైజ్ సీఐ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలలో భాగంగా 14 వ రోజు గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ గౌరీ అమృత వర్షిణి, శ్రీ నూకంబిక అమృత వర్షిని పెతకం శెట్టి సుజాత , కూచిపూడి నృత్య అకాడమీ కూర్మాన పాలెం డాక్టర్ పసుమర్తి. వెంకటరమణ కూచిపూడినృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ నాయుడు,ఎక్సైజ్ ఎస్సై ఎస్వి నారాయణ, ఉడా రమేష్, కొణతాల రాజేంద్ర, చేబ్రోలు దుర్గా ప్రసాద్, పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాకారులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో నూకాంబిక ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఈస్ట్ కోస్ట్ రైల్వే
టెండరు నెం. 30255356, తేదీ. 08.04.2025
పని పేరు: ఆటోమ్యాటెడ్ వేసైడ్ వీల్ ప్రొ ఫైల్ మెజర్‌మెంట్ సిస్టమ్ (AWWPMS) సప్లయి, ఇన్‌స్టలేషన్, టెస్టింగ్ మరియు కమీషనింగ్ చేయుట. (వారంటీ కాలం: డెలివరీ తేదీ తర్వాత 30 నెలలు). పరిమాణం: 1 సెట్, తనిఖీ చేయు వారు: TPI ఏజన్సీ.
సూచన: మెటీరియల్‌ను 45 రోజులలోగా సప్లయి చేయాలి.
టెండరు తెరచు తేదీ మరియు సమయం: 07.05.2025న 1500 గంటలు
పూర్తి వివరములు లభించు వెబ్‌సైట్ www.ireps.gov.in.
సీనియర్ డివిజనల్ మెటీరియల్ మేనేజర్/ వాల్తేరు
PR-28/Q/25-26

# ఫైలేరియా కిట్లు పంపిణీ



తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):- ది 11-04-25న ప్రభుత్వం వారు సరఫరా చేసిన ఫైలేరియా (బోధకాలు వ్యాధి గ్రస్తులకు) కిట్లను తాళ్ళపూడి పి.హెచ్.సి. డాక్టర్ హారిక గుప్తా ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ,ఎం. వెంకటేశ్వరావు మరియు హెల్త్ సూపెర్వైజర్ కే.ఎల్. రాయ్, తదితర సిబ్బంది పంపిణి చేశారు.

## జ్యోతి రావు పూలేకు నివాళి



చాగల్లు, (విశాఖ సమాచారమ్):- ఇందిరమ్మ కాలనీ లో గల మండల పరిషత్ పాఠ శాలలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బి.మధు శేఖర్, ఉపాధ్యాయులు డి.ప్రభు కుమార్, తగరం తిమోతీ తదిత రులు పాల్గొని. బడుగు, బహుజను లకు, మహిళలకు విద్యను అందించి సమాజం లో నిమ్న వర్గాల అభివృద్ధికి పాటు పడిన మహనీయుడని జ్యోతిరావ్ పూలే దార్శినికతను కొనియాడి. విద్యార్థులకు వివరించి మిఠాయిలు పంచారు.

## అకాల వర్షంతో నేలకొరిగిన అరటి

నాతవరం, (విశాఖ సమాచారమ్):- అకాల వర్షంతో నేలకొరిగిన అరటిపంట. నాతవరం మండలంలో చమ్మ చింత గ్రామానికి చెందిన అప్పన రమణ, అప్పన శ్రీను, అప్పన నూకరాజులకు సంబంధించి, ఐదు ఎకరాల అరటి పంట గురువారం సాయంత్రం 5 గంటలకు ఈదురుగాలితో కూడిన వర్షంతో నేలకొరిగింది దీంతో రైతు లబోదిపోమంటున్నారు వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారు ఈ మేరకు శుక్రవారం సంబంధించిన నర్సంపేట సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు నవీన్, రవితేజ తెలియజేయగా వారుపంటలను పరిశీలించారు. విషయం ఉన్నతాధికారులకు తెలియచేస్తామని చెప్పారు.

## జనసేన పార్టీలో చేరిన బుచ్చయ్యపేట వైసీపీ సర్పంచులు




బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- చోడవరం నియోజకవర్గం బుచ్చయ్యపేట మండలం వైస్సార్సీపీ పార్టీకి చెందిన పెదమదీన సర్పంచ్ కొల్లిమల్ల వెంకటరమణ, చినమదీన గ్రామ సర్పంచ్ పచ్చి కూర మంగావేణి గోవిందరావులు వీరితో పాటు పెదమదీన ఉపసర్పంచ్ డి. పాపారావు, కోపరేటివ్ మాజీ డైరెక్టర్ కొల్లిమల్ల మాణిక్యం, కుమ్మరి శాలివాహన సంఘ అధ్యక్షురాలు మాకవరపు లక్ష్మి, యాదవ సంఘం అధ్యక్షులు వియ్యపు గోవింద్, పెదమదీన పంచాయతీ వార్డు సభ్యులు అప్పారావు, జగదీష్ ,రామారావు, మహేష్, స్కూల్ కమిటీ మాజీ అధ్యక్షులు మహేష్, బుల్లిబాబులతో పాటు సుమారు 100 కుటుంబాలు శుక్రవారం జనసేన చోడవరం నియోజకవర్గ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు, ఉమ్మడి విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు, పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబుల సమక్షంలో జనసేన పార్టీలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ జాయిన్ అయిన నాయకులందరూ పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు నిజాయితీతో కూడిన సేవలు అందించాలని, అందరు కలిసి పనిచేద్దామని భవిష్యత్తులో జనసేన పార్టీ కి చోడవరం కంచుకోట కావాలని అన్నారు . పివిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేడు జాయిన్ అయిన నాయకులు అందరూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వచ్చే ఎన్నికల్లో విజయంతో పాటు ప్రజల్ని అభివృద్ధి చేసే క్రమంలో ఎప్పుడూ ముందుండాలని , అలాగే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి నాయకత్వంలో జనసేన పార్టీ నాయకులు సైనికులు వీర మహిళలు పని చేస్తున్నారని ఇదే పని విధానంతో భవిష్యత్తులో మనందరం కలిసి పనిచేసే చోడవరం అభివృద్ధి లక్ష్యంగా పని చేద్దామని, ఈ రోజు జాయిన్ అవుతున్న నాయకులందరికీ మనస్ఫూర్తిగా స్వాగతం తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డిఎస్ నాయుడు, ఉపాధ్యక్షులు తుమ్మపాల రమేష్ , పార్టీ సీనియర్ నాయకులు దాడి సూరి నాగేశ్వరరావు, దాడి గోవింద , మండపాక బాబురావు, కోరుకొండ సూరి అప్పారావు, దొండా సాయి, పొలమరశెట్టి కృష్ణ , బుదిరెడ్ల అరుణ్, కొలిమల్ల నాగేశ్వరరావు, కొలిమల్ల శ్రీను, గంట్ల నరేష్ , కొల్లి కొండాజీ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పని చేయాలి

కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- పార్టీ అభివృద్ధికి క్రియాశీల కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపూడి పరమేశ్వరరావు స్పష్టం చేశారు. మాడుగుల నియోజకవర్గం బిజెపి క్రియాశీల కార్యకర్తల అవగాహన కార్యక్రమం శుక్రవారం స్థానిక వరలక్ష్మి ఫంక్షన్ హాల్ లో జరిగింది. మండల బిజెపి అధ్యక్షురాలు పైల అమ్మాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈర్ల శ్రీరామమూర్తి బీజేపీ జిల్లా ఇంచార్జ్ కర్రి చిట్టిబాబు మాడుగుల నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి మేడపురెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పరమేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 16 17 తేదీల్లో గావు చలో కార్యక్రమం ద్వారా క్రియాశీల కార్యకర్తలు అందరూ సమీపంలోని గ్రామాలకు వెళ్లి ఎనిమిది గంటల పాటు గ్రామ సమస్యలను అడిగి తెలుసుకోవాలని నివేదికను జిల్లా పార్టీకి అందించాలని కోరారు ఏప్రిల్ 13 సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని అన్ని అంబేద్కర్ విగ్రహాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించి అంబేద్కర్ జన్మదిన సందర్భంగా దీపోత్సవం నిర్వహించాలన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు పూలే



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- మహాత్మా జ్యోతి రావు పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు అని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. శుక్రవార జ్యోతి రావు పూలే 198 జయంతి వేడుకలను కలెక్టరేట్ ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి కలెక్టర్ పూల మాల వేశి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళ ల అభ్యున్నతి కోసం కృషి చేసి తన జీవితాన్ని ధారా పోసిన మహాత్ముడు అని అన్నారు. దిగువ కులాల ప్రజలకు సమన హక్కు పొందటానికి సత్య శోధక్ సమాజ్(సొసైటీ అఫ్ స్పీకర్స్ అఫ్ ట్రూత్) ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. పూలే మరియు అతని భార్య సావిత్రి భాయి పూలే దేశంలో మహిళా విద్య కు మార్గదర్శకులు అని తెలిపారు. మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలు చేసి దేశ ప్రజల మన్ననలు పొందారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. పద్మలత, కలెక్టర్ కార్యాలయం అధికారులు, తదితరులు పాల్గొన్నారు జ్యోతి రావు పూలే 198 జయంతి వేడుకలను పాడేరు ఐటిడిఎ కార్యాలయంలో కూడా ఘనంగా నిర్వహించారు. ఐటిడిఎ ఇంచార్జ్ ప్రాజెక్ట్ అధికారి డా. ఎం జె అభిషేక్ గౌడ, సహాయ ప్రాజెక్ట్ అధికారులు వి ఎస్ ప్రభాకర్ రావు, ఎం వెంకటేశ్వరరావు జ్యోతి రావు పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలకు అయన చేసిన సేవలను కొనియాడారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల ప్రత్యేక శ్రద్ధ

## జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్

జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఫిర్యాదులు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ, డి ఆర్ ఓ కె. పద్మలత తో కలసి వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 110 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2347 ఫిర్యాదులను ఆడిట్ చేయవలసి ఉందన్నారు. వ్యవసాయను బంధ రంగాలలో 15 వృద్ధి రేటును సాధించాలని చెప్పారు. అరకు వ్యాలీ మండలం గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాల ( బాలురు పివిటిజి) పాఠశాలకు ప్రహరీ గోడ మంజూరు చేయాలని జి. మల్లేశ్వరరావు వినతి పత్రం సమర్పించారు.చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ కట్టువీధికి మంచినీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు గడుతూరు జీవరత్నం, వెలగ దావీదు వినతి పత్రం అందజేసారు.పాడేరు మండలం బంట్రోతుపుట్టు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గెమ్మిలి నాగేశ్వరరావు దరఖాస్తులో పేర్కొన్నారు.జి.మాడుగుల మెయిన్ రోడ్డు నుండి చుట్టు మెట్ట వరకు రింగు రోడ్డు నిర్మించాలని వంతాల తిమోతి వినతి పత్రం అందజేసారు.హుకుంపేట మండలం కామయ్యపేట రోడ్డు మరమ్మతులు చేపట్టాలని తడిగిరి, తీగల వలస, గ్రామ ప్రజలు పి.గంగరాజు, పి. రామచంద్ తదితరులు దరఖాస్తులో పేర్కొన్నారు. ముంచంగిపుట్టు మండలం జర్రెల పంచాయతీ బొడ్డగొంది గ్రామానికి పాఠశాల భవనం మంజూరు చేయాలని సర్పంచ్ ఎస్. భాగ్యవతి కోరారు.కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ పిట్టలపాడు గ్రామస్తుడు సిందేరి నాగేశ్వరరరావు తన పిల్లలు సిందేరి వైశాలి పేరును రేషన్ కార్డులో నమోదు సమర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్బి ఎస్ నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్ రజనీ, ఈ ఈ వేణుగోపాల్, జి. డేవిడ్ రాజు, పాడేరు తాహశీల్దార్ వి. త్రినాధరావు నాయుడు, ధ్వమా పి.డి.డా. విద్యా సాగర్, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పునర్వ్యవస్థీకరణ సంస్కరణల దుష్ప్రభావాన్ని అరికట్టాలి

- ఎమ్మెల్యే కొణతాల కు యుటిఎఫ్ నాయకులు వినతి పత్రం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):- అనకాపల్లి యుటిఎఫ్ యూత్ జిల్లా నాయకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ని కలిసి పాఠశాల పునర్వ్యవస్థీకరణ సంస్కరణలలో జరుగుతున్న దుష్ప్రభావా ఆరికట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ త్వరలో చేపట్టబోతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, సంస్కరణల పేరుతో పాఠశాలల కుదింపు వలన పాఠశాలలో నష్టపోతున్నాయని అలాగే ఉపాధ్యాయ పోస్టులు కుదింపుకు గురవుతున్నాయని ఎమ్మెల్యే కొంతాల రామకృష్ణ దృష్టికి ఆయన తీసుకొచ్చారు. ఒక పంచాయతీలో ఎన్ని పాఠశాలలుంటే అన్ని పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలు కొనసాగిస్తూ 40 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఉంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే 75 మంది విద్యార్థులు కంటే తక్కువ ఉన్న ఉన్నత పాఠశాలల లో హెచ్ఎం, పిడి పోస్టులను ప్రభుత్వం తీసివేయబోతుందని అది సరికాదని ఆయన అన్నారు. అలాగే ఐదు కిలోమీటర్ల పరిధిలో హైస్కూల్ లేని యూపీ పాఠశాలలను డౌన్ గ్రేడ్ చేయకుండా, యూపీ పాఠశాలలు గానే కొనసాగించాలని ఆయన కోరారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలాగా చూడాల న్నారు. పంచాయతీలలో ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీగానే కొనసాగించాలని ఆ మోడల్ ప్రైమరీ లో పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా, ఐదు తరగతులకు కనీసం ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవో వలన వేల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు,మిగులు ఉపాధ్యాయులు (సర్ప్లస్ పోస్ట్స్) గా మిగిలిపోయారన్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, సంస్కరణల పేరుతో అదే తప్పును పునరావృతం చేయకూడదని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్య కొంతాల రామకృష్ణ మాట్లాడుతూ మీ విజ్ఞాపన పత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, సహాధ్యక్షులు రొంగలి అక్కు నాయుడు, యుటిఎఫ్ నాయకులు నాతవరపు సతీష్, కృష్ణ కిషోర్, రవి, ఆశ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రిఫ్రెషింగ్ లాంజ్ సద్వినియోగం చేసుకోండి



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- జిల్లా ప్రధాన కేంద్రం పాడేరు ఐటిడిఎ వద్ద అనకాపల్లి శ్రీ లక్ష్మీనరసింహ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్, రిఫ్రెషింగ్ లాంజ్ లను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జేసి డా. అభిషేక్ గౌడ తో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సొసైటీ ఆధ్వర్యంలో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ నిర్మాణాలు చేపట్టి గిరిజన ప్రజల ఆదరాభిమానాలు పొందడం గొప్ప విషయమన్నారు. అదే స్ఫూర్తి తో నిర్వహణ భాధ్యతలు చేపట్టి అవసరమైన వారికి సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా స్థానిక ప్రజల కోసం కాకుండా బయట నుండి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అవసరమైన వారిఆదార్ కార్డు ఆధారంగా వారికి లాంజ్ కేటాయించాలని, సులాబ్ కాంప్లెక్స్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, వారి నుండి నామ మాత్రంగా కొంత ఫీజు తీసుకుని సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. పై అంతస్తులో అయిదు గదులతో డార్మిటరి నిర్మించి అందుబాటులోకి తెస్తే రంపచోడవరం, చింతూరు లాంటి దూర ప్రాంతాల నుండి వచ్చి తిరిగి వెళ్ళలేని వారికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఐటిడిఎ అధికారులు, పంచాయతి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఎటువంటి గొడవలు రాకుండా పోలీస్ వారి సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా పివిటిజి గ్రామాలను దత్తత తీసుకోవడానికి సొసైటీ స్వచ్ఛందంగా ముందుకు రావలాని కోరారు. అరకు లో కూడా ఈ తరహ లాంజ్ సులాభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ముందుకు వస్తే స్థలం కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.

శ్రీ లక్ష్మీనరసింహ సొసైటీ అధ్యక్షులు ఎస్.ఎం నాయుడు మాట్లాడుతూ నిర్మాణానికి సుమారు రూ.85 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని, అప్పట్లో స్థలాన్ని చారిటీగా వినియోగించే నిమిత్తం అప్పటి పిఒ రోణంకి గోపాల కృష్ణ స్థలం కేటాయించారని, తదుపరి వి. అభిషేక్ ప్రతుత పిఓ డా. అభిషేక్ గౌడ సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ ఆవరణలో ఉచిత వైఫై, టివి, హాట్ వాటర్, 24 గంటలు వాటర్, సోఫా, బెడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గిరిజనులు కోసం ఒక నాణ్యమైన సులాభ్ కాంప్లెక్స్, లాంజ్ ఏర్పాటు చేసి వారికి సేవలు అందించడంలో సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

సొసైటీ సభ్యులు ఎస్. జగదీశ్వర రావు జిల్లాలో ఒక పివిటిజి గ్రామాన్ని ఎంపిక చేసి తనకు దత్తత ఇస్తే ఆ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, పిల్లలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తానని ముందుకు వచ్చారు.

ఈ కార్యక్రమంలో జేసి డా. అభిషేక్ గౌడ, జిల్లా పంచాయతి అధికారి లవ రాజు, డివిజినల్ పంచాయతి అధికారి పీఎస్ కుమార్, తహసిల్దార్ త్రినాద్ రావు నాయుడు, సొసైటీ కార్యదర్శి బి. ఈశ్వర అప్పల నాయుడు, సభ్యులు ఎస్.జగదీశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## సంతోషిమాత ఆలయానికి వాటర్ ప్యూరిఫైడ్ విరాళం



వి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- మండలంలోని కేజే పురం జంక్షన్లో గల సంతోషిమాత ఆలయానికి వాటర్ ప్యూరిఫైడ్ ను దాత విరాళంగా అందించారు. శుక్రవారం కేజే పురం గ్రామానికి చెందిన జలుమూరు వెంకట సత్యనారాయణ జ్ఞాపకార్థం వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ను వారి కొడుకు రామ్మోహన రావు, కోడలు వరలక్ష్మి విరాళంగా అందించినట్ట ఆలయ ధర్మకర్త కాళ్ళ అమ్మ తల్లి నాయుడు తెలిపారు. అలాగే వారి కుటుంబానికి అమ్మ తల్లి నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## సిపి చొరవతో నిరాశ్రయునికి ఆశ్రయం




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- గుంటూరు జిల్లా మాచర్ల కు చెందిన నాగేశ్వరరావు వయస్సు 45 సం,ఇతనికి వివాహము కాలేదు. తల్లిదండ్రులు చనిపోయారు. ఒకప్పుడు లారీ క్లీనర్ గా పనిచేసేవాడు. ఒక ప్రమాదంలో కన్ను పోగొట్టుకున్నాడు. అప్పటి నుండి రోడ్ల మీద తిరుగుతూ బిక్షాటన చేస్తున్నాడు. జగదాంబ దగ్గర బిక్షాటన చేస్తుంటే విశాఖ పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చీ ఇతనిని చూసి మహరాణిపేట పోలీస్ వారికి చెప్పడంతో అక్కడి పోలీసులు ఇతనిని రెస్క్యూ చేసి టి.ఎస్.ఆర్ కాంప్లెక్స్ లో ఉన్న జీవియంసి ఏయూటీడి నిరాశ్రయ వసతి గృహానికి తీసుకురావడంతో ఆశ్రయం కల్పించడం జరిగింది. ఈ రెస్క్యూలో ఎస్.ఐ లక్ష్మీ, కానిస్టేబుల్ రాంబాబు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- ప్రముఖ సంఘ సేవకులు మహాత్మా జ్యోతిరావ్ పూలే వారి 199వ జయంతి సందర్భంగా పట్టణం. లోని గుండాల జంక్షన్ వద్ద గల ఎస్.ఆర్.శంకరన్ మీటింగ్ కాంప్లెక్స్ నందు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధి గా మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే రామకృష్ణ నివాళు లర్పించారు.అనంతరం బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు కి సంబంధించి సుమారు 400మంది లబ్ధిదారులకు 8కోట్లు రూపాయల చెక్కుని అంద చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి , రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర తదితర నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీటీసి నిధులతో రైతుల కల్లాల వద్ద బోరు ఏర్పాటు



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- మండలంలోని వడ్డాది పాడి రైతుల కల్లాల వద్ద తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం జడ్పీటీసీ దొండా రాంబాబు ఈ బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పాడి రైతులు వ్యవసాయ కల్లాల వద్ద తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో జడ్పీటీసీ నిధులతో బోర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, పాడి రైతులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
శనివారం 12-4-2025

# విద్యా విధానంలో మార్పు అవశ్యం

శాస్త్ర సాంకేతికత ఆధారంగా ముందుకెళుతున్న నేటి ప్రపంచంలో 'విద్యే' ఆ దేశ సౌభాగ్యాన్ని, సంక్షేమాన్ని, భద్రతను నిర్ధారిస్తుంది. అందుకనే ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణు బాంబులు వేసినా మళ్లీ పునర్నిర్మాణం చేసుకోగలం, దానికి ఉదాహరణయే నేటి జపాన్. అయితే ఏ దేశంలో అయితే విద్యా వ్యవస్థను నాశనం చేస్తామో.. ఆ దేశం శతాబ్దాల తరబడి అభివృద్ధి వైపు పయనించదనేది మేధావుల అభిప్రాయం. మన జాతి పునర్నిర్మాణం చెందాలంటే మన పాఠశాలలు, కళాశాలలో నుండి బయటకు వచ్చే విద్యార్థుల గుణాత్మకతపై ఆధారపడి ఉంటుంది. ఈ దశగానే ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండి గుణాత్మక విద్యను అందించడానికి ప్రస్తుతం విద్యా విధానాలలో అనేక రకాల మార్పులను చేసి పాఠశాల విద్య బలోపేతానికి కృషి చేస్తామని చెబుతోంది. గత ప్రభుత్వం చాలా వరకు పాఠశాలల రూపురేఖలు మార్చగా.. ప్రస్తుత ప్రభుత్వం విద్యావిధానాలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టేందుకు సమాయత్తం అవుతోంది. దీనిలో భాగంగానే ఐదు రకాల బడుల విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది. శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, బేసి ప్రైమరీ స్కూల్స్, మోడల్ ప్రైమరీ స్కూల్స్, ఉన్నత పాఠశాలలు వీటిలో ఉంటాయి. అందులో భాగంగానే విద్యార్థులకు గుణాత్మక విద్యను పెంపొందింపచేసే ఉద్దేశంతో 'మోడల్ ప్రైమరీ స్కూల్స్' విద్యా విధానాన్ని తీసుకురానున్నారు. 45 నుండి 60 మంది విద్యార్థులున్న ప్రతి పాఠశాలను మోడల్ పాఠశాలలుగా గుర్తిస్తారు. అలాంటి పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయుల చొప్పున కేటాయించి ఒకటి నుండి ఐదవ తరగతి వరకు ఒక్కొక్క తరగతికి ఒక్కొక్క ఉపాధ్యాయుడిని ఉంచి క్వాలిటీ ఎడ్యుకేషన్ ప్రతి విద్యార్థికి అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది.

ప్రస్తుతం సుమారు 12 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. అక్కడ అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రతిరోజూ ఆ ఉపాధ్యాయుడు 18 రకాల సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి. 60 మంది లోపు ఉన్న కొన్ని పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండి ప్రతిరోజు 9 రకాల సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి నెలకొన్న తరుణంలో అక్కడ నాణ్యమైన విద్య విద్యార్థులకు అందడం అనేది ఎండమావుల నుండి నీటిని ఆశించినట్లే అవుతుంది. విద్యార్థుల వెనుకబాటుతనానికి ఇదొక ప్రధాన కారణంగా ప్రభుత్వం భావిస్తోంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి రాష్ట్ర విద్యాశాఖ మోడల్ స్కూల్ విధానాన్ని పేద విద్యార్థుల కోసం తీసుకువచ్చింది. దీనివల్ల ఒక్క ఉపాధ్యాయుడే అన్నేసి రకాల సబ్జెక్టులను బోధించాల్సిన అవసరం లేకుండా తను ఏ సబ్జెక్టులో అయితే నిష్ణాతుడై ఉంటే ఆ సబ్జెక్టునే బోధించవచ్చు.

విద్యా విధానాలలో తీసుకొస్తున్న మార్పులలో 'విద్యా శక్తి' కార్యక్రమం ఒకటి. దీని వలన విద్యార్థులకు 'హైబ్రిడ్ లెర్నింగ్' అందుతుంది. అంటే వెనుకబడిన విద్యార్థులను ముందు ఉంచడానికి వీరికి ఆన్లైన్ ద్వారా కానీ, ఆఫ్లైన్ ద్వారా కానీ తరగతులు చెప్పించటానికి ఐఐటీ మద్రాస్ వారితో విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ కాలేజీలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు సైతం ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌లకు కోచింగ్ తరగతులను విద్యాశక్తి పేరుతో నిర్వహిస్తారు. ప్రస్తుతం కొన్ని చోట్ల పైలట్ ప్రాజెక్టు కింద సుమారు 1800 మందికి ఉన్నత విద్య అవకాశాల కోసం కోచింగ్ ఇప్పిస్తున్నారు. రాబోయే రోజులలో ప్రతి కళాశాలలో ఇది అందుబాటులోకి తీసుకురావలసిన అవసరం ఉంది. గ్లోబలైజేషన్‌లో భాగంగా ఇంగ్లీష్ ప్రాముఖ్యత ననుసరించి ఆంగ్ల భాష కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించేందుకు 'మిషన్ ఇంగ్లీష్ ఫ్లూయెన్సీ' లాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. కాలానుగుణంగా వచ్చే నూతన మార్పులను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులను సంసిద్ధం చేయడం విద్యా లక్షణాలలో ఒకటి. అందుకనే ప్రస్తుత కాలంలో ఏఐ యుగాన్ని అనుసరించి విద్యార్థి దశ నుండే డిజిటలీకరణకు అలవాటు చేసేందుకు 'స్మార్ట్ క్లాస్ రూమ్స్' ను పెంచే విషయమై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

విద్య అంటే బోలెడన్ని పుస్తకాలు చదవడం, బట్టీ పట్టడం, పరీక్షలు రాయడం కాదు. విద్య అంటే శీల నిర్మాణం. విద్య అంటే మానవులలో విలువలను పెంపొందించేది. అయినప్పటికీ ప్రస్తుత కాలంలో మన సమాజంలో విలువలు లోపిస్తున్నవి అనేది అక్షర సత్యం. ఆ విలువలు పతనం కాకుండా వాటిని విద్యార్థి దశ నుండి నిలబెట్టేందుకు తగు ప్రణాళికలను ఈ అకడమిక్ క్యాలెండర్‌లో పొందుపర్చారు. అయితే ఈ మార్పులను చిత్తశుద్ధితో అమలుచేస్తేనే సత్ఫలితాలు సాధ్యం.

## పంచాంగం

శనివారం 12-4-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం

| | |
|---|---|
| తిథి | : శు. పూర్ణిమ పూర్తి |
| నక్షత్రం | : హస్త సా. 6.08 |
| వర్జ్యం | : రా. 3.07 ల 4.57 |

# 'మూసీ' నుంచి భాగ్యనగరాన్ని కాపాడిన అపర మేధావి

## సందర్భోచితం

## నేడు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతి



భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్‌గానే కాకుండా గొప్ప పాలనాదక్షునిగా ఎంతో కీర్తిని సొంతం చేసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 30 సంవత్సరాల పాటు అపారమైన సేవలనందించి దేశ ప్రగతికి ఎంతగానో దోహదపడ్డారు భారత తొలి తరం ఇంజినీర్. ఆయన మార్గదర్శకత్వంలో రూపుదిద్దుకున్న నిర్మాణాలు నేటికీ చెక్కుచెదరలేదంటే అతిశయోక్తి కాదు. మూసీ నది వరద నివారణ, వైజాగ్ పోర్టు నిర్మాణం, తిరుపతి ఘాట్ రోడ్డు నిర్మాణం, హైదరాబాద్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్.. ఇలా అనేక ప్రాజెక్టులు ఆయన మేధస్సుకు ప్రతీకగా నిలిచిన మచ్చు తునకలు.

మానవ ప్రగతి ప్రస్థానంలో ఇంజినీరింగ్ రంగానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆనకట్టలు, డ్యాంలు, రైల్వే వంతెనలు, సొరంగ మార్గాలు, రహదారులు ఇలా ఎన్నింటినో ఇంజినీరింగ్ నిపుణులు తమ అసాధారణ ప్రతిభతో సాధించగలిగారు. అలాంటి వారిలో భారత జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య. ఇంజినీర్‌గా మన దేశ ఖ్యాతిని నలుదిశలా చాటారు. ఈ రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి, ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను ఆవిష్కరించారు. ఆయన మార్గదర్శకత్వంలో నిర్మాణాలు నేటికీ అవి చెక్కుచెదరలేదంటే అతిశయోక్తి కాదు. భారత్‌లో అత్యంత గొప్ప ఇంజనీర్ అయిన ఆయన జయంతి (సెప్టెంబరు 15)ని దేశవ్యాప్తంగా 'ఇంజినీర్స్ డే' జరుపుకుంటారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సెప్టెంబరు 15, 1861న చిక్కబల్లాపూర్ (కర్నాటక) సమీపంలోని ముద్దెనహళ్ళిలో జన్మించారు. ఆయన పూర్వీకులు ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందినవారు. విశ్వేశ్వరయ్య తండ్రి స్కూల్ టీచర్. కానీ 12 ఏళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయారు విశ్వేశ్వరయ్య. ఆ దు:ఖాన్ని దిగమింగుతూనే బెంగళూరులో హైస్కూల్ విద్య, 1881లో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత పుణేలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో చేరారు. సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. బొంబాయిలోనే కొన్నాళ్లు పనిచేసి ఆ తర్వాత ఇండియన్ ఇరిగేషన్ కమిషన్‌లో చేరారు. అప్పుడే భారతదేశానికి ఓ మేధావి గురించి తెలిసింది. 20వ శతాబ్దంలో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. జలాశయాల నిర్మాతగా, ఆర్థికవేత్తగా శాశ్వత కీర్తిని గడిరచారు. ఇంజినీర్‌గా జీవితాన్ని ప్రారంభించిన డాక్టర్ విశ్వేశ్వరయ్య దేశాభివృద్ధికి దోహదం చేసే అనేక నీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు.

1912 నుండి 1918 వరకు మైసూర్ దివాన్‌గా పనిచేసిన విశ్వేశ్వరయ్య... మైసూర్‌లోని కృష్ణరాజసాగర్ (కెఆర్ఎస్) నిర్మించారు. మైసూర్ 'ఆదర్శ నగరం'గా మారడంలో ఆయన పాత్ర ఎనలేనిది. హైదరాబాద్, ముంబయి నగరాలకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ రూపకల్పన, విశాఖపట్నం పోర్ట్ ఏర్పాటులో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. దేశాభివృద్ధిలో ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యను 1955లో 'భారత రత్న' పురస్కారంతో గౌరవించింది. బ్రిటిష్ ప్రభుత్వం అత్యుత్తమ పౌర పురస్కారమైన 'బ్రిటిష్ నైట్‌హుడ్'ను కూడా విశ్వేశ్వరయ్య పొందారు. దీంతో ఆయన పేరుకు ముందు 'సర్' వచ్చి చేరింది.

ఉపకార వేతనంతో పుణేలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విశ్వేశ్వరయ్య.. బొంబాయి రాష్ట్ర ప్రభుత్వంలో పబ్లిక్ వర్క్స్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించారు. ఏడాది వ్యవధిలోనే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమితులయ్యారు. విశ్వేశ్వరయ్య పనితీరు అద్భుతంగా ఉండటంతో.. సుక్కూర్ బ్యారేజ్ నిర్మాణానికి ఇంజనీర్‌గా నియమితులయ్యారు. సింధూనది నీరు సుద్నోరుకు చేరేలా చేయడంలో విశ్వేశ్వరయ్య కీలక పాత్ర పోషించారు. 1909లో మైసూర్ ప్రభుత్వం విశ్వేశ్వరయ్యను చీఫ్ ఇంజనీర్‌గా నియమించింది. మైసూర్ సమీపంలో నిర్మించిన కృష్ణరాజ సాగర్ ఆనకట్టకు ఆయనే చీఫ్ ఇంజినీర్‌గా వ్యవహరించారు.

1900ల్లో మూసీ నదికి వచ్చిన వరదల కారణంగా హైదరాబాద్ నగరం అతలాకుతలం అయ్యేది. మూసీ వరదల బారి నుంచి భాగ్యనగరాన్ని రక్షించే బాధ్యతలను నిజాం నవాబు మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు అప్పగించారు. విశ్వేశ్వరయ్య ఆలోచనల ప్రకారమే.. మూసీపై ఎగువన రిజర్వాయర్లు నిర్మించారు. జలాశయాల నిర్మాణంతో భాగ్యనగరికి వరద ముప్పు తప్పింది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ రిజర్వాయర్‌లు ప్రస్తుతం హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. నిజాం నవాబు విన్నపం మేరకు హైదరాబాద్‌కు మురుగునీటి పారుదల వ్యవస్థను ఆయనే రూపొందించారు.

విశాఖపట్నం ఓడ రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడంలోనూ విశ్వేశ్వరయ్య కీలక పాత్ర పోషించారు. విశాఖ రేవును నిర్మాణ సమయంలో అలల పోటు ఎక్కువగా ఉండేది. అలల తీవ్రతను తగ్గించడం కోసం ఆయన ఆయన ఓ సలహా ఇచ్చారు. రెండు పాత నౌకల్లో బండరాళ్లు వేసి సాగర తీరానికి చేరువగా ముంచేయాలని సూచించారు. అలా చేయడం వల్ల అలల తీవ్రత తగ్గింది. కొన్నాళ్ల తర్వాత కాంక్రీటుతో బ్రేక్ వాటర్స్ నిర్మించారు.

తిరుపతి ఘాట్ రోడ్ ఏర్పాటు కోసమూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కృషి చేశారు. ఇంజనీర్‌గా, మైసూర్ దివాన్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం 1955లో ఆయనకు భారతరత్న పురస్కారాన్ని అందజేసింది. భారత దేశానికి ఎనలేని కృషిచేసిన ఆయన1962 ఏప్రిల్ 12న శాశ్వతంగా దూరమయ్యారు.

-సుగుణ శేఖర్ రెడ్డి గుమ్మళ్ల (ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్)

## పిలుస్తున్నాడు పూలే.. ఓ ఛాందసుడా..నిద్ర లే!



ఎక్కడ అణచివేత మొదలైతే
అక్కడ తిరుగుబాటుకు
బీజం పడినట్టే..
ఎప్పుడు తిరస్కరణ
ఎదురైందో అప్పుడు
సంస్కరణకు శ్రీకారం జరిగినట్టే..
అయితే ఆ అణచివేత
అనే మాటకు అర్థం
తెలియక ముందే..
తిరస్కరణ అనుభవానికి
రాక మునుపే
తిరుగుబాటుకుజ
తెరెత్తిన వాడు పూలే..
అమ్మ కడుపులోనే
అడ్డం తిరిగేసాడేమో
ఎదురెళ్ళడమే నేర్చాడు..
ఎదిరించడమే నేర్చాడు..
ప్రశ్నించడమే అజెండా..
ధైర్యమే గుండె నిండా!

నాదే సంప్రదాయం..
నేనే వేదం అంటే..
అది పిడివాదమని చాటుతూ..
నీలాగే నేను..
నాలాగే అందరూ..
ఇదే వాదం..అదే నాదం..
పోరాటమే పథం..
తిరగబడ్డమే రిథం!

కొందరికే చదువంటే కుదరదన్నాడు..
ఇంతి ఇంటికే పరిమితమంటే
కాదని రోడ్డెక్కాడు..
అధమునికి గుడిలో ప్రవేశం లేదంటే ఒప్పనన్నాడు..
బడే గుడని..
అక్షరమే అమ్మని..
కలమే బలమని..
హలమే ఆయుధమని..
పూరించాడు శంఖం..
ఛాందసానికి అభిముఖం!

ఎన్ని చేశాడు
స్త్రీజనోద్ధరణ కోసం..
ఆయన కృషి ఫలితమే
నేటి అమ్మ గడపలో
ఈ శ్రావణమాసం..
అతివకు అక్షరం వస్తేనే తెగువన్నాడు..
ఆమె పసి వయసులోనే
వితంతువైతే
అది తగదన్నాడు..
అమ్మకు ఆసరాగా ఓ బడి..
నిమ్నుడి కోసం ఓ గుడి..
అలా ఏం చేసినా
ఓ ఒరవడి..!
పతికి తోడుగా సతి..
ఆమె ఆసరాతో
అనాధలకు వసతి..
అలా..ప్రతి దురాచారంపై
ప్రశ్నిస్తూ..నిలదీస్తూ..
బాపూ పుట్టక మునుపే
మహాత్ముడు..
కందుకూరికి
చాలా ముందే సంస్కర్త..
ఆధునిక భారతంలో
తిరుగుబాటుకుజ
తొలి ధర్మకర్త..!

మహాత్మ పూలే జయంతి
సందర్భంగా
ప్రణామాలు అర్పిస్తూ..

ఎలిశెట్టి సురేష్ కుమార్
9948546286

## "అవును నాన్నా కృష్ణుడు తిన్నాడు"



ఒకసారి గురువాయూర్ ఆలయంలో పూజలు చేస్తున్న నంబూద్రి ఒకరు అత్యవసరంగా ఆలయం నుంచి బయలుదేరవలసి వచ్చింది.

అయితే ఆలయంలో పూజలు ఎటువంటి ఆటంకాలు లేకుండా జరగాలి. కనుక ఆ నంబూద్రి తన కొడుకుకి ఆ బాధ్యతలు అప్పగించి నిర్ణీత సమయానికి స్వామికి నైవేద్యం పెట్టాలని చెప్పి వెళ్ళాడు.

అలాగే అని ఆ కొడుకు స్వామికి అన్నం వండాడు. దానిని స్వామి ముందుంచి తినమని చెప్పాడు. కానీ గురువాయూరప్పన్ తినలేదు. వొట్టి అన్నాన్ని గురువాయూరప్పన్ ఎలా తింటాడనుకున్న ఆ బాలుడు దగ్గరున్న ఇంట్లోంచి పెరుగు, ఆవకాయ తీసుకొచ్చాడు.

పెరుగును అన్నంలో కలిపి ఆవకాయ పెట్టాడు.

అప్పటికీ గురువాయూరప్పన్ అన్నం ముట్టలేదు.

ఆరగించవయ్యా తండ్రీ అని అన్నాడు చిన్నోడు. బతిమాలాడు. కానీ లాభం లేకపోయింది. ఎంత చెప్పినా గురువాయూరప్పన్ ఒక్క మెతుకూ ముట్టలేదు. అప్పుడు ఆ కుర్రాడు ఇదిగో స్వామీ, మా నాన్న వచ్చాడంటే నీకు అన్నం పెట్టలేదని నన్ను తిడతాడు. కనుక కాస్తంతైనా తిను స్వామీ అన్నాడు. విలపించాడు.

కుర్రాడి కన్నీరు చూసి జాలిపడ్డ గురువాయూరప్పన్ అతనికి తన దర్శనాన్ని ఇచ్చాడు. అన్నమూ తిన్నాడు. పిల్లాడు సంతోషపడ్డాడు. ఖాళీ పళ్ళెంతో కుర్రాడు గర్భ గుడిలోంచి ఇవతలకు వచ్చాడు.

మామూలుగా అయితే స్వామికి నైవేద్యం పెట్టిన తర్వాత అక్కడ ఉండే ఒకరికి దానిని పెట్ట తినమని చెప్పడం ఓ సంప్రదాయం. అయితే ఖాళీ పళ్ళెంతో కుర్రాడు బయటకు రావడం చూసిన ఒకరు అతనిపై మండిపడ్డాడు.

అన్నమేదీ అని అడిగాడు.

అప్పుడు పిల్లాడు అంతా కృష్ణుడు తిన్నాడుగా అన్నాడు.

ఈలోపు నంబూద్రి పని ముగించుకుని రావడంతోనే రోజూ నైవేద్యాన్ని తినే అతను నంబూద్రితో ఫిర్యాదు చేశాడు. నైవేద్యం మొత్తం మీ కుమారుడు తినేశాడు అని చెప్పాడు.

నంబూద్రి కొడుకుని అడిగాడు నైవేద్యాన్ని ఏం చేశావని.

పిల్లాడు జరిగినదంతా చెప్పాడు. కృష్ణుడు తనకు దర్శనమివ్వడమే కాకుండా నైవేద్యం మొత్తం తిన్నాడని అంటాడు.

కొడుకు మాటల మీద నమ్మకంలేక నంబూద్రి అతను ఎక్కడైతే పెరుగు, ఆవకాయ తీసుకొచ్చాడో వారింటికి వెళ్ళి అడిగాడు. వాళ్ళు తాము పెరుగు, ఆవకాయ ఇచ్చామన్నారు.

అయినా నంబూద్రి కోపం చల్లారలేదు. రోజూ పూజ చేసే తనకు కనిపించని కృష్ణుడు నీకు దర్శమిచ్చి నువ్వు పెట్టిన పెరుగన్నం తిన్నాడా అని గదమాయించాడు. తిట్టాడు. కొట్టాడు.

వొట్టి అన్నం పెడితే తినలేదని, అన్నంలో పెరుగు కలిపి ఆవకాయ పెడితే ఆ కృష్ణుడు తిన్నాడని అబద్ధం చెప్తావా అని కొడుకుని నిలదీశాడు.

కానీ కుర్రాడు చెక్కుచెదరలేదు. పిల్లాడిని నంబూద్రి కొట్టడం చూసి ఉండబట్టలేకపోయాడు కృష్ణుడు.

నంబూద్రి మళ్ళీ కొట్టడానికి చెయ్యి పైకెత్తినప్పుడు అవును, నేనే తిన్నాను....పిల్లాడు తప్పేమీ చేయలేదు అని గర్భగుడిలోంచి ఓ అశరీరవాణి మాటలు వినిపించాయి.

ఆ మాటలతో నంబూద్రితోసహా అక్కడున్న వారందరూ విస్తుపోయారు.

నంబూద్రి కళ్ళు చెమ్మగిల్లాయి.

నా కుమారుడికి కనిపించి అతను పెట్టిన అన్నాన్ని తిన్నావా స్వామీ.... నీ కరుణ ఏ పాటిదో అర్థమైంది స్వామీ...నా కొడుకు భాగ్యవంతుడు కృష్ణా అంటూ నంబూద్రి కొడుకుని హత్తుకున్నాడు.

- యామిజాల జగదీశ్

## బెల్లం ఆరోగ్యానికి ప్రయోజనకారి



బంగారు వన్నెతో అందంగా తీయగా మంచి వాసనగలిగిన బెల్లం గురించి తెలుసుకుందాం. బెల్లం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకారి.బెల్లం శక్తినిస్తుంది. చాలా పోషకాలు కలది. అన్ని వయసులవారు బెల్లం తినవచ్చు. ముఖ్యంగా పిల్లలకు, యుక్తవయసువారికి, గర్భిణీలకు, క్రీడాకారులకు, మంచిది. మధుమేహం కలవారికి స్థూలకాయులకు అంత మంచిదికాదు.

బెల్లంలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. క్రమం తప్పకుండా దీన్ని తింటే ఐరన్ లోపం వల్ల వచ్చే రక్త హీనత తగ్గుతుంది.

బెల్లంలోని తియ్యదనం మంచి ఎండార్ఫిన్‌లు విడుదలచేస్తుంది. ఇవి స్త్రీలకు బహిష్టు సమయంలో వచ్చే సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. నిస్పృహనుంచి కాపాడతాయి. కడుపు ఉబ్బరం శరీరంలో నీరుచేరడం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. కండరాల నొప్పులను, కండరాలు పట్టేయడాన్ని బెల్లంలోని మెగ్నీషియం తగ్గిస్తుంది. బెల్లంలోని జింకు సెలీనియంలు శరీరంలోని ఎంజైమ్‌ల వ్యవస్థలపై పనిచేసి ఫ్రీరాడికల్స్‌ను అడ్డుకుంటాయి. బెల్లంలో ఉండే ఫినాల్ అనే శక్తివంతమయిన యాంటీయాక్సిడెంట్ శరీర రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. బెల్లంలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. బెల్లం జీర్ణకారక ఎంజైమ్‌లను చురుగ్గా ఉంచి ఆహారం త్వరగా జీర్ణం కావడానికి దోహదపడుతుంది. కడుపు ఉబ్బరం ఎసిడిటీలు తగ్గుతాయి. అందుకే చాలామంది భోజనం తర్వాత చిన్న బెల్లంముక్క తినమని చెబుతారు. గొంతులో కఫాన్ని బయటకు నెట్టడంలో బెల్లం సహకరిస్తుంది. జలుబు దగ్గులనుంచి ఉపశమనం కలిగిస్తుంది. రక్తాన్ని వెచ్చబరిచే సామర్థ్యం ఉంటుంది. బాగా చలిగా ఉన్నపుడు బెల్లం తింటే వెచ్చదనం ఉంటుంది. వెక్కిళ్లు వచ్చినపుడు బెల్లం ముక్క తింటే అవి తగ్గుతాయి. బెల్లంలో యాంటీయాక్సిడెంట్స్ పీచు అధికంగా ఉండడం వల్ల శరీర వ్యవస్థను పరిశుద్ధపరచడానికి డీటాక్సిఫికేషన్‌కు సహాయపడుతుంది. బెల్లం కాలుష్యప్రభావాలపై పోరాడే శక్తి కలిగి ఉంటుంది. ముఖ్యంగా దుమ్ముకు గురయ్యే ఫ్యాక్టరీ గని కార్మికులకు బాగా మేలు చేస్తుంది.

సాధారణంగా చెరుకు నుంచి మొలాసిస్‌ను వెలికితీసి తయారుచేస్తారు. ఇది ప్రతి ఒక్కరు ఉపయోగించేది. తాటికల్లు ఈతకల్లు ఖర్జూరాల నుంచి కూడా బెల్లం తయారు చేస్తారు. బంగారు గోధుమరంగు నుంచి గోధుమరంగులో ఉండే బెల్లం చెరుకురసం కాయడం ద్వారా లభిస్తుంది. ఖర్జూరరసాన్ని మరిగించి తయారుచేసేది బంగారు గోధుమ రంగుల నుంచి ముదురు గోధుమరంగులో ఉంటుంది. తాటి రసాన్ని మరిగించడం ద్వారా తయారుచేసే బెల్లం సగం తెలుపు నుంచి లేత పసుపురంగులో ఉంటుంది. మయన్మార్‌లో దీన్ని ఎక్కువగా వాడతారు.

- యామిజాల

## చరిత్రలో ఈ రోజు (ఏప్రిల్ 12)

**సంఘటనలు:**

1961 : రష్యా అంతరిక్ష శాస్త్రవేత్త యూరీ గగారిన్ ఉపగ్రహంలో ప్రయాణించి అంతరిక్షంలోకి వెళ్ళిన మొదటి మానవునిగా నిలిచాడు.

1981 : ప్రపంచపు మొట్టమొదట స్పేస్ షటిల్ (అంతరిక్షంలోకి వెళ్ళి తిరిగి రాగల వ్యోమనౌక) 'కొలంబియా'ను అమెరికా విజయవంతంగా ప్రయోగించింది.

2009 : థాయిలాండ్ లోని పట్టాయ నగరంలో ఆసియాన్ దేశాల కూటమి శిఖరాగ్ర సమావేశం ప్రారంభం

2010 : లూధియానా, పంజాబ్, లో గల గురునానక్ స్టేడియంలో భారతీయ కబడ్డీ జట్టు పాకిస్థాన్ జట్టును 58-24 తేడాతో ఓడిరచి ప్రప్రథమంగా ప్రపంచ కప్ కబడ్డీ పోటీలను గెలుచుకుంది.

**జననాలు:**

599 బీసీ వర్థమాన మహావీరుడు, జైన మతం స్థాపకుడు. 24 వ తీర్థంకరుడు.

1854 : ఎస్.పి.నరసింహులు నాయుడు తమిళనాడుకు చెందిన భారత జాతీయ కాంగ్రెసు నాయకుడు, సమాజసేవకుడు, ప్రచురణకర్త.

1879: కోపల్లె హనుమంతరావు, జాతీయ విద్యకై విశేష కృషిన వారు.

1917: వినూమన్కడ్, భారత క్రికెట్ జట్టు మాజీ క్రీడాకారుడు.

1925: అట్లూరి పిచ్చేశ్వర రావు, కథకుడు, అనువాదకుడు, నవలా రచయిత, సాహిత్యవేత్త.

1936: అమరపు సత్యనారాయణ, నటుడు, గాయకుడు, రంగస్థల కళాకారుడు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దు!

## సీపీఎం ఇంటింటి ప్రచారం పోస్టర్ ఆవిష్కరణ

**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** విద్యుత్తు స్మార్ట్ మీటర్లతో ప్రజలపై మరిన్ని భారాలను వేయదానికి ఉద్దేశించినదిగా, ఆదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకు ప్రజలపై మరిన్ని భారాల మోపేందుకే ఈ స్మార్ట్ మెటల్ తీసుకొస్తున్నారని తెలియజేస్తూ సిపిఎం పార్టీ బుచ్చయ్య పేట మండలంలో ఇంటింటి కరపత్రాలు ,పోస్టర్లు అంటించి ప్రచారం నిర్వహించనున్నదని ఈ మేరకు ప్రచార పోస్టర్ను సిపిఎం నాయకులు నేడు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని నేడు ట్రూ అప్, సర్ చార్జీల పేరుతో 15 వేల కోట్ల రూపాయలు పైగా భారం వేయడంతో పాటు, స్మార్ట్ మీటర్ల పేరుతో మరో 10 వేల రూపాయలు ప్రజలపై భారాలు మోపడానికే ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని అన్నారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని స్మార్ట్ మీటర్లు మాకొద్దు అనే నినాదంతో స్మార్ట్ మీటర్ల బండారాన్ని తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్తు ను మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల కట్టబెట్టి ప్రజలకు ఇచ్చే రాయితీలు, రైతులకు ఇచ్చే సబ్సిడీలను కోతలు పెట్టటానికి ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయని, అందులో భాగంగానే ఈ స్మార్ట్ మీటర్లు నేడు ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని అన్నారు. దీనిపై మండల వ్యాప్తంగా కరపత్రాలు, పోస్టర్లతో విస్తృతంగా ప్రజల్లో ప్రచారం నిర్వహించి దీని వ్యతిరేకంగా భవిష్యత్తులో ప్రత్యేక పోరాటం నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబశివరావు, ఎన్వీ నాయుడు, శ్రీను, రాజు, రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## Spoken English -24

@- Lesson 8: CHOOSING A TIME TO MEET ( కలవడానికి ఓ సమయాన్ని ఎంచుకొనుట)

--:Jennifer, would you like to have dinner with me? - జెన్నీఫర్, నీవు నాతో డిన్నర్ చేస్తావా?

- Yes. That would be nice.- అవును, అది బావుంటుంది.

-- When do you want to go? -- ఎప్పుడు వెళ్ళాలను కుంటున్నావు?

-- Is today OK? -- ఈ రోజు ఓకేనా?

--:Sorry, I can't go today.-- సారీ, ఈ రోజు వెళ్ళలేను.

- How about tomorrow night? - రేపు రాత్రి ఎలా వుంటుంది?

-- Ok. What time? - ఓకే, ఏసమయం?

--:Is 9:00 PM all right? -:రాత్రి 9 ఓకేనా?

--:I think that's too late.- అది బాగా ఆలస్యమౌతుందేమో?

-- Is 6:00 PM OK--- పోనీ 6:00 పీఎం ఓకే?

-- Yes, that's good. Where would you like to go? -- అవును, అది బావుంటుంది. నీవు ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నావు?

-- The Italian restaurant on 5th street. -- 5 వ నెంబర్ రోడ్డులో వున్న ఇటాలియన్ రెస్టారెంట్ కు.

- Oh, I don't like that Restaurant. I don't want to go there.- ఓ.. నేను ఆ రెస్టారెంట్ను ఇష్టపడను. నేను అక్కడకు వెళ్ళాలనుకోవడం లేదు.

- How about the Korean restaurant next to it? - దాని ప్రక్కనే వున్న కొరియన్ రెస్టారెంట్ ఎలా వుంటుంది?

-- OK, I like that place.- ఓకే, నేను దానిని ఇష్టపడతాను.

@- Lesson 9: WHEN DO YOU WANT TO GO?- (నీవు ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నప్పుడు? )

- Hi Mark. - హాయ్ మార్క్

- హాయ్ - Hi.

- What are you planning to do today? - ఈ రోజు నీవు ఏం చేయాలని విశ్చయించుకుంటున్నావు?

- I'm not sure yet - నేను ఇంకా నిశ్చయించుకోలేదు.

- Would you like to have lunch with me? - నీవు నాతో లంచ్ చేస్తావా?

-Yes. When?- అలాగే, ఎప్పుడు?

- Is 11:30 AM OK? - ఉదయం 11:30 కు ఓకేనా?

-:Sorry, I didn't hear you.- సారీ,నీవు చెప్పింది వినపడలేదు.

-- Can you say that again, please? - దయచేసి, మళ్ళీ చెప్పగలవా?

- I said, 11:30 AM. - ఉదయం 11:30 అని చెప్పా.

- Oh, I'm busy then. Can we meet a little later? - ?.. – ఓ.. అప్పుడు నాకు ఖాళీ లేదు.కొంత విరామం తర్వాత కలుద్దాం.

-- OK, how about 12:30 PM? - ఓకే. మధ్యాహ్నం 12:30 ఎలా వుంటుంది?

-- Where?- ఎక్కడ?

-- How about Bill's Seafood Restaurant? - బిల్స్ సీఫుడ్ రెస్టారెంట్ ఎలా వుంటుంది?

--:Oh, Where is that?- ఓ..అది ఎక్కడ?

-- It's on 7th Street. - అది 7 వ నెంబర్ రోడ్డులో వుంటుంది.

-- OK, I'll meet you there.- ఓకే. నేను నిన్ను అక్కడ కలుస్తాను.

@-:Lesson 10: ORDERING FOOD+ ఫుడ్ ఆర్డర్ చేయుట

- Hello sir, welcome to the French Garden Restaurant. హలో సార్ ఫ్రెంచ్ గార్డెన్ రెస్టారెంట్ కు స్వాగతం.

-- How many? - ఎంతమంది?

--One.- ఒక్కరు

- Right, this way. Please have a seat. Your waitress will be with you in a moment. - మంచిది.దయచేసి కూర్చోండి.మీ పరిచారకురాలు కొద్ది సేపట్లో మీ వద్ద వుంటుంది.

- Hello sir, would you like to order now? - హలో సార్ , ఇప్పుడు ఆర్డర్ చేస్తారా?

- Yes, please.- అవును తప్పకుండా.

- What would you like to drink? - మీరు ఏమి తాగుతారు?

= What do you have? - మీ వద్ద ఏమి వున్నాయి?

- We have bottled water, juice, and Coke. - మా వద్ద సీసాల్లో వుంచిన నీళ్ళు,రసాలు, మరియు కోక్ లు వున్నాయి.

- I'll have a bottle of water, please.- దయచేసి నాకొక నీళ్ళ సీసా కావాలి.

_ What would you like to eat? - మీరు ఏమి తినాలనుకుంటున్నారు?

**By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250**

**(Visakha Samacharam)**

# నాటు సారా నిర్మూలన కు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు

## ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో నాటు సారా నిర్మూలన కు నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమం లో భాగంగా అనకాపల్లి, కశింకోట మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ తెలిపారు. గ్రామ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తో ఈ కమిటీలు ఏర్పాటు కు సహకరించాలని అనకాపల్లి మండల పరిషత్ ఎంపీపీ గొర్లి సూరిబాబు ను సీఐ కోరారు. ఈ కమిటీ లో మండల స్థాయి అధికారులు తహసీల్దార్, ఎంపీడీఓ, మండల పరిషత్ ఎంపీపీ, రూరల్ సీఐ, ఎక్సైజ్ సీఐ, ప్రజాప్రతినిధులైన గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ లు నాటు సారా నిర్మూలన కు సహకరించాలని కోరారు. అనకాపల్లి మండలంలోని వల్లూరు, గొర్లిపాలెం, తగరంపూడి, రాజుపాలెం గ్రామాల్లోను, కశింకోట మండలంలో జమ్మాదులపాలెం, పేరంటాలపాలెం, ఉగ్గినపాలెం గ్రామాల్లో నాటుసారా తయారీ ప్రభావిత గ్రామాలుగా గుర్తించినట్లు సీఐ చెప్పారు. ఈ కమిటీలు ద్వారా నాటుసారా వలన కలిగే ప్రమాదాలు, అనార్థలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించవలవలసిన అవసరం ఉందన్నారు. అలాగే గ్రామాల్లో బెల్ట్ షాపు లు నిర్వహణ కు అనుమతులు లేవని ఏరైనా బెల్ట్ షాపు లు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని 6 నెలలు లో మరో కేసు నమోదు అయితే పీడీ యాక్ట్ లు నమోదు చేస్తామని అలాంటి పరిస్థితులు కు గురికాకుండా, ఇబ్బందులు పడకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సూరిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో యువత నాటుసారా, గంజాయి వంటి మత్తు పదార్థాలు కు బానిసలు కాకుండా తల్లిదండ్రులు కు, యువత కు అవగాహన కల్పించి యువత చెడు మార్గం పట్టకుండా కాపాడవలసిన బాధ్యత ప్రజాప్రతినిధులు కు, అధికారులకు ఉందని తల్లిదండ్రులు కూడా పిల్లలు స్నేహాలు, నడివడిక, ప్రవర్తన పై నిఘా ఉంచి వారు పక్క దారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ కె. నర్సింగరావు, ఎక్సైజ్ ఎస్సై నారాయణ, ఎంపీటీసీ ఉన్నారు.

# పెరుగుతున్న రియల్ ఎస్టేట్ దందా!

- కిరాయి మనుషులను వాడుకుంటున్న కొత్త సంస్కృతి
- సివిల్ కేసులో పోలీసులు జోక్యం
- ప్రజావాణీ లో పరిష్కారం కాని పేదల సమస్యలు

**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** జిల్లా లోని రియల్ ఎస్టేట్ దందా రోజు రోజుకి పెరుగుతుంది,కిరాయి మనుషలను పేదల పై ఉసిగొలిపే కొత్త సంస్కృతి పెరుగుతుంది. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం పెరుగుతుంది, ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జరుగుతున్న ప్రజా వాణీలో నూటికి 90 శాతం పేదలు సమస్యలు పరిష్కారం కావడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న పేర్కొన్నారు.శు క్రవారం అయిన ఓ ప్రకటన విడుదల అనంతరం అయిన మాట్లాడారు, రావికమతం, మండల కోట్నాబిల్లి గ్రామానికి చేందిన గొరా.పెద్దిరాజు ఆదివాసీ గిరిజనుడకు సర్వే నెంబర్ 144/1లో రెవెన్యూ అధికారులు పూర్వం పట్టా ఇచ్చారని తెలిపారు.దీన్ని అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటు ఉపాధి పోందుతున్నారని తెలిపారు.దీనిపై నర్సిపట్నంకు చేందిన అదికారి.గోపాలరావు కుటుంబ సభ్యులు కన్ను ఈ భూమిపై పడిందని తెలిపారు. దింతో ఈభూమి నాదంటు గత కోంత కాలంగా గొరా పెద్దిరాజును వేదిస్తు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. గురువారం



రెండు పోలీసులు స్టేషన్లు కు చేందిన పోలీసులు, రెవెన్యూ అధికారులు నర్సిపట్నంకు చేందిన 50 కిరాయి మనుషలను అదికారి.గోపాలరావు కుటింభీకులు ను తీసుకు వచ్చి గొరా.పెద్దిరాజును బలవంతంగా భూమి నుండి గెంటి వేశారని తెలిపారు. ,వెంటనే గొరా.పెద్దిరాజుకు ఇచ్చిన పట్టా భూమిని చూపించి బలవంతంగా కిరాయి మనుషలతో తోలగించిన అదికారులు, పోలీసులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.జిల్లాలోని ఇటువంటి సంఘటనలు అనేక మైనవి జరుగుతున్నాయని తెలిపారు. మంగళవారం దేవరాపల్లి మండలం లోని ఎ కోత్తపల్లి లో ఓ రీయల్ ఎస్టేట్ వ్యాపారి కిరాయి మనుషలతో దాడి చేసారని తెలిపారు. భూస్వాములు ను ధనవంతలు అక్రమించుకుంటే అదికారులు నోరు మేదపడం లెదన్నారు. గర్సింగి పంచాయతీ ప్రభుత్వ భూమిలో బొరువేసెసి గెడ్డలు కప్పేసిన పట్టించుకో లెదన్నారు. దేవరాపల్లి కాయగూరలు మార్కెట్ నుండి రైవాడ లింక్ కెనాల్ వరకు కోట్లు విలువ చేసె ఇరిగేషన్ భూములు అమ్మేషిన పట్టించుకోలెదన్నారు. కె కోటపాడు మండలం కింతలి ఆర్లేలో ప్రభుత్వ భూమిని అక్రమించేసిన పట్టించుకో లెదన్నారు. బుచ్చయ్యపెట మండలం ఆర్ బీమవరంలో 110 ఎకారాలు ప్రభుత్వ భూములు అక్రమించేసిన పట్టించుకో లేదన్నారు. వి మాడుగుల మండలం శంకరం పంచాయతీ లో వందల ఎకారాలు భూములు అక్రమించేసిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రే స్వాయాన ప్రభుత్వ భూములు అక్రమిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్లకు అదేశాలు జారి చేసిన పట్టించు కోవడం లెదన్నారు.ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ లో జరుగుతున్న ప్రజావాణీ లో నూటికి 90 శాతం సమస్యలు పరిష్కారం కావడం లెదన్నారు. సివిల్ కేసులో పోలీసులు జోక్యం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.9/77 అసైన్డ్ చట్టాన్ని రక్షించ వలసి అదికారులే భూస్వాములు కు కొమ్ము కాస్తు న్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# గిరిజన సంప్రదాయాలకు ప్రతీక ఇటుకల పండుగ

## మన్య ప్రాంతాల్లో కోలాహలంగా ప్రారంభమైన పర్వదిన వేడుకలు - తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న చెక్ పోస్ట్ ల వద్ద స్నేహపూర్వకంగా తాచేరు వసూలు





**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** మన్య ప్రాంతంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఇటుకల పండుగ గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహిస్తున్నారు. గిరిజన పల్లెల్లో ఇటుకల పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ పండుగను అల్లూరి జిల్లా ఏజెన్సీలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా వివిధ పేర్ల తో పిలుచుకుంటూ ఉండడం అందరికీ తెలిసిందే. ఎక్కువ ప్రాంతాల్లో ఈ పండుగను ఇటుకుల పండుగని, డోలీ (ఊయల) పండుగని పిలుచుకుంటూ ఉంటారు. ప్రతీ ఏటా తెలుగువారి నూతన సంవత్సరమైన ఉగాది పర్వదినం తరువాత మన్య ప్రాంతంలో ఈ పండుగ ప్రారంభమవుతుందని మన్యవాసులు నమ్ముతూ ఉంటారు. పురుషులు, మహిళల కోసం వెదురు కర్రలతో ఉయ్యాలను తయారు చేస్తారు. ఆ ఉయ్యాలలో, మహిళలు ఊగుతూ ఆనందంగా ఈ వేడుకను ఆస్వాదిస్తారు. అనంతరం గ్రామంలోని ప్రతి కుటుంబంలో నుంచి పురుషులు అడవికి వేటకు బయలుదేరి వెళ్లాలని ఆచారంగా భావిస్తూ ఉంటారు ఈ క్రమంలో మహిళలు గ్రామంలోనే ఉంటూ, గ్రామ సమీపంలోని రహదారి పైకి వచ్చి ఇటుకల పండుగలో భాగమైన తాచేరు వసూలు చేసేందుకు రహదారి కి అడ్డంగా చెక్ పోస్టుల మాదిరిగా, కర్రను గాని, తాడును గాని ఏర్పాటు చేస్తారు. అలాగే పాఠశాలకు వెళ్లే పిల్లలు మొదలుకొని పండు ముదిసలి వరకు అందరూ అక్కడకు చేరుకుంటారు. ఇదే క్రమంలో పూలు, కుంకుమ, బియ్యం ను పళ్లెం లో ఏర్పాటు చేసుకుంటారు. ఇటుకుల పండుగ ను పురస్కరించుకొని. రహదారికి అడ్డంగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వచ్చి పోయే వాహనాలను ఆపుతూ తాచేరు వసూలు చేసే కార్యక్రమంలో మహిళలందరూ నిమగ్నమై ఉంటారు. ఈ క్రమంలో వాహనదారులు వారికి తోచినంత నగదును పళ్లెంలో వేయడం జరుగుతుంది. ఈ మేరకు వాహనాలకు కుంకుమ బొట్టు పెట్టి వాహనానికి పువ్వులు అమర్చుతారు. తాచేరు వసూలు చేసే క్రమంలో నగదు ఇవ్వక పోయి, పారిపోయేందుకు ప్రయత్నించిన వారిపై ముందుగా అమర్చుకున్న రంగు కలిపిన మంచినీళ్లను, గ్లాసు, చెంబుల సహాయంతో వారిపై స్నేహ పూర్వకంగా చల్లుతుంటారు. నీళ్లు చల్లినప్పటికీ పురుషులు మాత్రం వారి మీద ఎటువంటి కోపాలను ప్రదర్శించకుండా ఆనందంగా నవ్వుకుంటూ అక్కడ నుంచి నిష్క్రమిస్తూ ఉంటారు. రోడ్డు మార్గంలో వచ్చే పోయే వాహనాల్లో అధికారులైన, ప్రజాప్రతినిధులైన, అలాగే ఎంతటి గొప్పవారైనా వారి వాహనములు ఆపవలసిందే. అదే క్రమంలో తాచేరు కూడా కచ్చితంగా ఇచ్చి తీరవలసిందే. ఇలా వచ్చి పోయే వాహనదారుల నుంచి తాచేరు వసూలు చేసే కార్యక్రమంలో చిన్న పిల్లలు మొదలుకొని పండు ముదుసలి వరకు తాచేరు వసూలు కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొంటారు.. ఇలా సాయంత్రం వరకు తాచేరు వసూలు చేసే పనిలో మహిళలందరూ నిమగ్నమై ఉంటారు. ఇదే క్రమంలో పురుషులు వేటకు వెళ్లి అడవులలో లభించిన జంతువులను వేటాడి, సాయంత్రం నకు గ్రామానికి చేరుకుంటారు. వేటకు వెళ్లిన క్రమంలో జంతువులను వేటాడని పక్షంలో, జంతువులను వేటాడి తీసుకువచ్చేంత వరకు పురుషులను గ్రామంలోనికి ఆహ్వానించరు. దీనిని గమనించిన పురుషులు ఎంత దూరమైనా వేటకు వెళ్లి వేటాడిన జంతువులను (చిన్నదైనా, పెద్దదైన) గ్రామానికి తీసుకొని వస్తారు. ఈ వేటకు గ్రామంలోని పురుషులందరూ (చిన్నపిల్లలు, ముసలి వాళ్లు మినహా) ఈ వేటలో తప్పనిసరిగా పాల్గొనవలసిందే. అనంతరం వారు వేటాడి తీసుకువచ్చిన జంతువును మహిళలకు చూపించి పురుషులు తమలో ఉన్న శౌర్యాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఈ క్రమంలో వేటాడి తీసుకువచ్చిన జంతువును (చిన్నదైనా, పెద్దదైనా) గ్రామంలోని అన్ని కుటుంబాల వారు సమానంగా పంచుకోవడంతో పాటు మహిళలు వసూలు చేసిన తాచేరు (నగదు) తో వంటలు వండుకొని, పిల్లాపాపలతో అందరూ సహా పంక్తి భోజనములు ఆరగిస్తారు. ఇదిలా ఉండగా పండగ చివర రోజున పసుపు, కుంకుమలతో గ్రామ దేవతలకు పూజలు నిర్వహిస్తూ ఉంటారు. గ్రామంలోని అన్ని గృహాల నుండి (ఇంటింటా) విత్తనాలను సేకరించి, గ్రామ దేవతలకు కొంత సమర్పించి ఆశీర్వాదం పొందుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో మిగిలిన కొన్ని విత్తనాలను వ్యవసాయంలో వాడుకునేందుకు గ్రామస్తులందరూ ఉపయోగించుకుంటారు. ఇలా చేయడం వలన ఆ సంవత్సరము తమ గ్రామంలో పంటలు బాగా పండుతాయని వారి ప్రగాఢ విశ్వాసం. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ ఇటుకుల పండుగకు ఏజెన్సీలోని అన్ని గ్రామాలలో దశలవారీగా వారం రోజులపాటు జరుపుకోవడం అందరికీ తెలిసిందేనని అనడంలో సందేహం లేదు. ఈ క్రమంలో వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించడం తో పాటు, సాంప్రదాయ నృత్యాలతో గిరిజనులు ఆడి, పాడి ఆనందంగా గడుపుతారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## రైల్వేలో 9,970 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులు



దేశవ్యాప్తంగా అన్నీ రైల్వే రీజియన్లలో భారీగా కొలువుల భర్తీకి రంగం సిద్ధమైంది. మొత్తం 9,970 అసిస్టెంట్ లోకో పైలట్ (ఏఎల్పీ) పోస్టులను భర్తీ చేసేందుకు రైల్వే శాఖ(రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. టెన్త్, ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఏప్రిల్ 12 నుంచి మే 11 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా ఉద్యోగాల ఎంపిక ఉంటుంది.

**ఆర్ఆర్బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్పూర్, చండీఘడ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్కతా, మాల్దా, ముంబయి, ముజఫర్పూర్, పట్నా, ప్రయాగ్రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్పూర్.

**ప్రకటన వివరాలు:**

అసిస్టెంట్ లోకో పైలట్ (ఏఎల్పీ): 9,970 పోస్టులు

ఆర్ఆర్బీ జోనల్ వారీ ఖాళీలు:

1. సెంట్రల్ రైల్వే- 376
2. ఈస్ట్ సెంట్రల్ రైల్వే- 700
3. ఈస్ట్ కోస్ట్ రైల్వే- 1,461
4. ఈస్ట్ రైల్వే- 868
5. నార్త్ ఈస్ట్రన్ రైల్వే- 100
6. నార్త్ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే- 125
7. నార్తన్ రైల్వే- 521
8. సౌత్ వెస్ట్రన్ రైల్వే- 679
9. సౌత్ సెంట్రల్ రైల్వే- 989
10. సౌత్ ఈస్ట్సెంట్రల్ రైల్వే- 568
11. సౌత్ ఈస్ట్రన్ రైల్వే- 921
12. సధరన్ రైల్వే- 510
13. వెస్ట్ సెంట్రల్ రైల్వే- 759
14. వెస్ట్రన్ రైల్వే- 885
15. మెట్రో రైల్వే కోల్కతా- 225

మొత్తం ఖాళీల సంఖ్య: 9,970

**ప్రారంభ వేతనం:** నెలకు రూ.19,900.

**అర్హత:** అభ్యర్థులు మెట్రిక్యులేషన్తో పాటు ఐటీఐ పూర్తి చేసి ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ చేసినవారూ అర్హులే.

**వయోపరిమితి:** 01-07-2025 నాటికి 18-30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ ఎస్టీలకు అయిదేళ్లుబీ ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

**దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

**ఎంపిక ప్రక్రియ:** ఫస్ట్ స్టేజ్ సీబీటీ-1, సెకండ్ స్టేజ్ సీబీటీ-2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

**ప్రశ్నపత్రం వివరాలు:** సీబీటీ-1కు 60 నిమిషాల సమయం ఉంటుంది. 75 ప్రశ్నలు, 75 మార్కులు కేటాయించారు. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. మ్యాథ్స్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, జనరల్ అవేర్నెస్ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి. సీబీటీ-2లో రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-ఏ విభాగానికి 90 నిమిషాల వ్యవధి, 100 ప్రశ్నలుబీ పార్ట్-బి విభాగానికి 60 నిమిషాల వ్యవధి, 75 ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. పార్ట్-ఏలో మ్యాథ్స్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, బేసిక్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్బీ పార్ట్-బిలో సంబంధిత ట్రేడ్ సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.

**ముఖ్య తేదీలు...**

**ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 12-04-2025.

**ఆన్లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 11-05-2025.

## బ్రాడ్కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్లో ఖాళీలు




బ్రాడ్ కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ పశ్చిమ్ బెంగాల్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 16వ తేదీ వరకు అభ్యర్థులు ఆఫ్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టు పేరు - ఖాళీలు**

1. సోషల్ వర్కర్: 01
2. పీఐసీయూ టెక్నీషియన్: 02
3. నెట్వర్క్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్: 01
4. జూనియర్ హిందీ టైపిస్ట్: 01

**మొత్తం ఖాళీల సంఖ్య: 05**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీఎస్డబ్ల్యూ), ఇంటర్మీడియట్, డిగ్రీ(కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** 30 ఏళ్లు.

**జీతం:** నెలకు సోషల్ వర్కర్కు రూ.24,000, పీఐసీయూ టెక్నీషియన్కు రూ.25,000, నెట్వర్క్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్కు రూ.30,000, జూనియర్ హిందీ టైపిస్ట్కు రూ.20,000.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆఫ్లైన్ ద్వారా.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.295, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

**చిరునామా:** చిత్తరంజన్ నేషనల్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, న్యూటౌన్ క్యాంపస్, మొదటి అంతస్తు, హెచ్ఆర్ సెక్షన్, స్ట్రీట్ నంబర్ 299, డీజే బ్లాక్(న్యూటౌన్), యాక్షన్ ఏరియా ఐ, న్యూటౌన్, కోల్కతా, న్యూటౌన్, పశ్చిమ్ బెంగాల్-700156.

**ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.

**ఇంటర్వ్యూ తేదీ:** 16-04-2025.

# వాడవాడలా ఘనంగా పూలే జయంతి వేడుకలు

## బడుగు, బలహీన వర్గాలకు అశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే

### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సంధర్బంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఈరోజు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి ఉత్సవాల సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులు అర్పించడం జరుగుతోందని అన్నారు. జ్యోతిరావు పూలే జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ తెలిపారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం జీవితం అంకితం చేసిన మహనీయుడు అని కొనియాడారు. సమాజంలో అంటరానితనం లేకుండా ఉండడానికి కృషి చేసిన వ్యక్తి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని, అటువంటి మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకున్నారని కలెక్టర్ తెలిపారు. కులం, మతం బేధాలు లేకుండా ఆడ, మగ తేడా లేకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించడం ముఖ్యమని నమ్మిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. ఆడపిల్లలకు విద్య చాలా అవసరమని, ఆర్థిక అసమానతల్లో తేడాలు లేకుండా ఎదగాలంటే చిన్నతనం నుండే చదువు ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే తరానికి ఆదర్శంగా ఉండాలని, ఆ బాధ్యత మనపై ఉందని అన్నారు.

ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ మరియు ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కింద 50% బ్యాంకు రుణము, 50% ప్రభుత్వం సబ్సిడీతో 400 యూనిట్లకు గాను రూ.10.45 కోట్ల చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకు అధికారులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. చివరగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మధుసూదనరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఏ కృష్ణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఎమ్.రవికుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి, నాయకులు జిల్లా అధికారులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

**మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఘన నివాళులు...**

ముందుగా స్థానిక హెూటల్ గ్రీన్ పార్క్ జంక్షన్ వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావుతో కలసి పూలమాలాంకరణ చేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెనుడిన వర్గాల అభ్యున్నతి కృషిచేసిన మహనీయుడని



కొనియాడారు. బాలికా విద్యకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, బాలికలకోసం, వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలలు స్థాపించారని చెప్పారు. బాలికల విద్యకు పూలే దంపతులు వేసిన పునాది, నేడు ఫలితాన్ని ఇస్తోందని, మహిళలు కూడా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు, మహిళోద్ధరణకు కృషి చేసిన వ్యక్తి మహాత్మ జ్యోతి రావు పూలే అన్నారు.

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ మహిళల చదువు కోసం 1848వ సంవత్సరంలో ప్రత్యేక పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. స్త్రీల హక్కుల కోసం, వారికి విద్యా అవకాశాలు కల్పించడం కోసం పనిచేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన వెనుకబడిన వర్గాల సమానత్వం కోసం కృషి చేసారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, జివియంసి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, సహాయ బీసీ సంక్షేమ అధికారులు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబు రావు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ డా.కుంభారవిబాబు, విశాఖపట్నం వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, సమన్వయకర్తలు, రాష్ట్ర, మాజీ జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర పార్టీ కార్యవర్గం సభ్యులు నగర జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు,రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, మాజీ రాష్ట్ర జిల్లా వివిధ కార్పొరేషన్ డైరెక్టర్, వార్డు అధ్యక్షులు,ముఖ్య నాయకులు ,సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుల స్ఫూర్తితో అడుగులు వేద్దాం

### దేవరాపల్లిలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):-** మహనీయుల స్ఫూర్తితో వారి ఆశయాలకు అనుగుణంగా పయనించాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం పిలుపునిచ్చింది.

మండల కేంద్రం దేవరాపల్లిలోని పాత ఎంపీడీవో ఆఫీస్ వద్ద శుక్రవారం సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి స్థానిక ఎస్ ఐ టి. మల్లేశ్వరరావు, సంఘ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ భారతదేశ ప్రాచీనకాలంలో వర్ణ, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి మనుషులందరూ సమానమని రుజువు చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అన్నారు. ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పూలేను తన గురువుగా భావించి ఆయన ఉద్యమాన్ని కొనసాగించి, భారత రాజ్యాంగం ద్వారా మనకు రావలసిన హక్కులన్నిటిని ప్రాథమిక హక్కులుగా చేర్చి అందించారన్నారు. ఈ దేశ మెజారిటీ ప్రజలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సమస్త హక్కులు నిరాకరించబడిన రోజులలో విద్య, రాజ్యాధికారం, సంపద లాంటి కనీస మానవ హక్కుల కోసం పోరాడిన తొలి వ్యక్తులు పూలే దంపతులు అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు,రొప్పల రాజు సబ్బవరపు శివశంకర్, ఉల్లి పరశురామ్, టి. శ్రీరామ్, కన్నాబత్తుల రాజు, పల్లా సంతోష్, కంకడాల సన్నిబాబు,ఎస్. దేముడు సాల్మన్ రాజ్, పాల్ రాజు, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త

### ఆయన ఆశయాలు కొనసాగింపే ఘనమైన నివాళి



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త, స్త్రీ విద్యను ప్రోత్సహించి వారి అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తిని వారు ఆశయ సాధన కోసం పనిచేయడమే నిజమైన ఘనమైన నివాళిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనపర్తి లో జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా వనపర్తి కెనాల్ రోడ్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డినివాళులు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు, సమాజంలో కుల వివక్ష, అంటరాని తనంపై పోరాటం చేశారని అన్నారు. వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలకు హక్కులు కోసం,మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్య క్రమంలో అనపర్తి టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరు శ్రీనివాస్ రెడ్డి( దత్తుడు శ్రీను) ఈస్టన్ డివిజన్ వైస్ చైర్మన్ తవలంపూడి సుధాకర్ రెడ్డి, మల్లిడి ఆదినారా యణ రెడ్డి దళిత నాయకులు నల్ల చిన్నారావు, తాతారావు, బీసీ నాయకులు మామిడి శెట్టి శ్రీను, ఒంటిమి సూర్య ప్రకాష్, బిజెపి అధ్యక్షులు కర్రి బుల్లి రెడ్డి, మల్లిడి సురేందర్ రెడ్డి, బాసి,టిడిపి మహిళా నాయకులు కర్రీ శేషారత్నం, కుతుకు లూరు సర్పంచ్ గొల్లు హేమ హేమ తులసి, రామవరం సర్పంచ్ గిరడ గంగాభవాని, వనపర్తి సర్పంచ్ వారాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):-** భీమిలి మండలం దాకమర్రి పంచాయతీలో ఘనంగా జ్యోతి రావు పూలే 198 వ జయంతి వేడుకలు దళిత కులాల సంక్షేమ సేవా సంఘం (డి కే ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భీమిలి తహసిల్దార్ పి.రామారావు, డికేఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు పతివాడ రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారతదేశంలో అణగారిన కులాలకు దశను దిశను నిర్దేశించినటువంటి మహెూన్నతమైన వ్యక్తి జ్యోతిరావు పూలేనని అన్నారు. నేటి సమాజంలో ఉన్న ప్రతి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు ఆయన చేసిన ఉద్యమాలను గుర్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు శంకరబుక్త.ప్రకాష్ చెల్లూరు నాని,రవ్వ ఈశ్వరరావు, బోనీ.కృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** సంఘసంస్కర్త, సత్య శోధక సమాజ స్థాపకుడు జ్యోతిరావు పూలే 198వ జయంతి పురస్కరించుకొని అనకాపల్లి టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు మాజీ శాసనమండలి సభ్యులు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాతయ్య బాబు నాగ జగదీష్ మాట్లాడుతూ పూలే సమాజంలో జరుగుతున్న అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు విశేషమైన కృషి చేశారని, అన గారిన కులాల ప్రజలకు సమాన హక్కులను పొందడానికి సత్యశోధక సమాజ్ ను ఏర్పాటు చేశారని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని, సంఘములో అన్ని మతాలు కులాలు ప్రజలు చేరవచ్చని పిలుపునిచ్చారని అన్నారు. దేశంలోనే తొలి బాలికా పాఠశాలను ప్రారంభించిన మహెూన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం నిరంతరం అన్ని వర్గాల ప్రజలు కృషిచేయాలని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాంద్రేగుల సత్యనారాయణ కుప్పిలి జగన్ మల్ల గణేష్ సాలాపు నాయుడు బోడి వెంకటరావు బుద్ధ భువనేశ్వరరావు యలమంచిలి బంగారు రాజు దాడి వేణు వేగి వెంకటరావు విల్లూరి రమణబాబు కొణతాల బాల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

### శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకొని పేదరికం లేని సమాజాన్ని స్థాపించాలి, దేశానికి ఆదర్శంగా నిలవాలని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక గుండాల జంక్షన్ వద్ద ఉన్న ఎస్.ఆర్. శంకరన్ మీటింగు కాంప్లెక్స్ నందు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇంచార్జి జిల్లా కలెక్టరు ఎమ్. జాహ్నవి అధ్యక్షతన నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిదిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరైన శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే దూరదృష్టి గల వ్యక్తి అని, ఆయన ఏ ఒక్క వర్గానికో చెందినవాడు కాదని, సమాజంలో సామాజికంగా వెనుకబడిన వర్గాలన్నింటికి నాయకుడు అని తెలిపారు. జనాభాలో సగభాగం గల స్త్రీలకు విద్య అందించాలని, వారికి జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని 1848 సంవత్సరంలోనే మహిళలకొరకు ప్రత్యేక పాఠశాలను స్థాపించిన గొప్పవ్యక్తి మహాత్మా జ్యోతిబా పూలే అని, రాత్రిబడిని, నిరాశ్రయులైన వితంతువులకు ఆశ్రమం, బాలహత్య ప్రతిబంధక్ గృహం స్థాపించి వితంతువులకూ, గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమపథకాలకు నలబైరెండువేల కోట్ల రూపాయలు, ఆదరణ పథకానికి పదహారు వందల కోట్లు రూపాయలు బడ్జెట్ లో కేటాయింపులు చేసిందని, సంక్షేమ శాఖల ద్వారా రుణాలు అందించే ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాలు పేపర్ల వరకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంచార్జి జిల్లా కలెక్టరు ఎమ్. జాహ్నవి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే భారతదేశంలో సామాజిక, సాంఘ్నిక సంస్కరణలకు మూలపురుషుడని తెలిపారు. ఆయన ఆలోచనలతోనే తరువాత తరం సామాజిక కార్యకర్తలు సమాజంలో మార్పుకోసం పోరాటాలు చేసారని, అణగారిన వర్గాలకు చేయూత అందించడానికే రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, దానిని సానుకూల పరిణామంగా గుర్తించాలని తెలిపారు. గవర కార్పొరేషను చైర్మన్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ సమాజం కోసం, సమాజంలో సంస్కరణల కోసం పోరాడిన మహాత్మా జ్యోతిబా పూలే వంటి వారి నాయకుల జీవిత చరిత్రలు భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో దూళి రంగనాయకులు, బొడ్డాద శ్రీనివాసరావు, బొట్ట చిన్నియాదవ్, బూసిరాజు మహాత్మా జ్యోతిబా పూలే జీవిత విశేషాలు, వారి జీవిత పోరాటాల గూర్చి ప్రసంగించారు. కార్యక్రమంలో చివరగా 400 లబ్ధిదారులకు మంజూరైన ఎనిమిది కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును లబ్ధిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి బిసి వసతిగృహవిద్యార్థినులు, లండకృష్ణ కళాకారుల బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర, యాదవ కార్పొరేషన్ల డైరెక్టర్లు విల్లూరు కృష్ణ, బొడ్డేల శ్రీనివాసరావు, ఆళ్ల మంగరాజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ గంగాధర్, గుడాల ముధిరాజ్ మరియు దొడ్డి సత్య అప్పారావు, గుడాల సత్యనారాయణ, బొడ్డాల అప్పారావు, బత్తుల లక్ష్మి, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిదులు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంక్షేమ అధికారులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

### ఘన నివాళులర్పించిన అనకాపల్లి జిల్లా పోలీసులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ (బ్యూరో):-** సామాజిక సమానత్వం, విద్యా హక్కులు, మరియు అణగారిన వర్గాల ఉన్నతి కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని, అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు పాల్గొని పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అదనపు ఎస్పీలు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే కుల వివక్షను అధిగమించి, మహిళా విద్యా ప్రాధాన్యతను సమాజానికి చాటిచెప్పిన గొప్ప సమాజ సంస్కర్త. ఆయన ఆశయాలను మనం ప్రతి రోజూ మన కార్యాచరణలో పాటించాలి. విద్య, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలి" అని అన్నారు. ఈ సందర్భంగా సమాజంలోని ప్రతి ఒక్కరూ మహాత్మా పూలే స్ఫూర్తితో సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డిటిసి డిఎస్పీ బి.మోహన రావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, లక్ష్మీ, రమేష్ గఫూర్, ఎస్సైలు సురేష్ బాబు, అంజిబాబు, మదీనపల్లి ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మాడుగుల వాసవి క్లబ్ నూతన ప్రెసిడెంట్ కొట్యాడ రమేష్



**వి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):–** మాడుగుల వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు జరిగింది. శుక్రవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. మాడుగుల వాసవి క్లబ్ ప్రెసిడెంట్ గా కోట్యాడ రమేష్, సెక్రటరీగా కోట్యాడ దేముళ్ళు, ట్రెజరర్ జాగాని కామేష్ , 10మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. అలాగే వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ గా పుట్టా రాధిక,, సెక్రటరీ శ్రీనాదు ఉమా, ట్రెజరర్ బత్తుల అరుణ 5 మంది మహిళలు కార్యవర్గ సభ్యులు నియమితులు అయ్యారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ ముఖ్య అతిధిగా అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు వై నర్సింగరావు. జిల్లా గవర్నర్. కే పార్వతి (పూర్ణిమ ), కాబినిట్ ట్రెజరర్ వి రత్నవాలి, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనాదు శ్రీనివాసరావు,ఆర్సీ పుట్టా నానాజీ, జిల్లాఆఫీసర్ పుట్టా మోహన్ రావు, జోన్ చైర్మన్ పుట్టా మాధవి హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిధులను, నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల వాసవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సిబ్బందిలకు అవగాహన కార్యక్రమం



**కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కే కోటపాడు పరిధిలోగల సింగన్న దొర పాలెం అంగన్వాడి కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా వెయ్యి రోజుల జాగ్రత్త లో ని భాగంగా శుక్రవారం పరిశుభ్రత అవగాహన కార్యక్రమం, శిశువులోని ఇన్ఫెక్షన్ నివారించడానికి చేతులు కడుక్కోవడం మరియు పరిశుభ్రత వాష్ నిర్వహించడం పై తల్లులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో సిడిపిఓ వి మంగతాయారు, జిల్లా హెచ్ డి ఏ పి ఎం శ్రీనివాస్, ఏ పీ ఎం కె. చిన్న బాబు మరియు సూపర్వైజర్ లు ఎల్ బి సుశీల, రాములమ్మ, ఆదిలక్ష్మి, మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఫుడ్ మెనూలో మార్పు?

### ఏపీలో వారానికి రెండు రోజులు ఎగ్ ఫ్రైడ్ రైస్



**అమరావతి, (విశాఖ సమాచారమ్):–** ఏపీ అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మరింత రుచికరమైన, ఎక్కువ పోషకాలుండే ఆహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కేంద్రాలకు వచ్చే 3-6 ఏళ్ల వయసున్న పిల్లలకు మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేయనుంది. వారంలో రెండు రోజులు మధ్యాహ్నం వేళ ఎగ్ ఫ్రైడ్రైస్, అదేరోజు ఉదయం అల్పాహారంగా ఉడికించిన శనగలు అందించనుంది. అన్ని కూరలు, పప్పులో మునగ పొడిని వినియోగించనుంది.

## డ్రైనేజీ కల్వర్టు పగిలి ప్రజలు ఇబ్బందులు



**తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):–** తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఐదో వార్డు ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డు ప్రక్కన డ్రైనేజ్ మీద వేసిన కల్వర్టు సీసీ ప్లేట్లు పగిలి ప్రజలు గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అటుగా ప్రయాణించే వాహనదారులు చాలా ఇబ్బందులకు గురై పలుమార్లు పడిపోతున్నారు రాత్రివేళ ఆ రోడ్డులో వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు.

పై అధికారులు, పంచాయతీ కార్యదర్శి, నాయకులు వెంటనే స్పందించి ఈ సమస్యను గట్టెక్కించాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వేసవికాలం నీటి ఎద్దడి లేకుండా సత్వర చర్యలు



**గోపాలపురం, (విశాఖ సమాచారమ్):–** వేసవికాలం భూగర్భ జలాలు అడుగంటిన యర్నగూడెం గ్రామంలో మంచినీటి కొరత లేకుండా కార్యాచరణ రూపొందించామని ఎర్నగూడెం గ్రామ సర్పంచ్ బొంత భరత్ బాబు ఈరోజు తెలిపారు 8 మంచి నీటి మోటార్లు 7 ఓవర్ హెడ్ ట్యాంకులతో నిరంతరం నీటి సరఫరా చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు చాలాచోట్ల మంచినీటి కుళాయిలకు కార్కులు లేని కారణంగా నీరు వృధా అవుతుందని దయవుంచి ప్రజలు తమంతట తాము నీటి వృధా అని అరికట్టాలని గ్రామంలో ఏ ప్రదేశంలో కూడా నీటి ఎద్దడి లేకుండా సత్వర చర్యలు చేపడుతున్నామని దీనికి ప్రజలు కూడా సహాయ సహకారాలు అందించాలని సర్పంచ్ భరత్ బాబు కోరారు గ్రామ ప్రజలు వాకింగ్కు ఇబ్బంది కలకూడదని దృఢ సంకల్పంతో సాయిబాబా గుడి చెరువు వెంబడి వాకింగ్ ట్రాక్ నిర్మించామని రోజువారి వాకింగ్ చేసే ప్రజలు ఆ ట్రాక్ ను వినియోగించుకోవాలని భరత్ బాబు తెలిపారు.

వేసవికాలం భూగర్భ జలాలు అడుగంటిన యర్నగూడెం గ్రామంలో మంచినీటి కొరత లేకుండా కార్యాచరణ రూపొందించామని ఎర్నగూడెం గ్రామ సర్పంచ్ బొంత భరత్ బాబు ఈరోజు తెలిపారు 8 మంచి నీటి మోటార్లు 7 ఓవర్ హెడ్ ట్యాంకులతో నిరంతరం నీటి సరఫరా చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు చాలాచోట్ల మంచినీటి కుళాయిలకు కార్కులు లేని కారణంగా నీరు వృధా అవుతుందని దయవుంచి ప్రజలు తమంతట తాము నీటి వృధా అని అరికట్టాలని గ్రామంలో ఏ ప్రదేశంలో కూడా నీటి ఎద్దడి లేకుండా సత్వర చర్యలు చేపడుతున్నామని దీనికి ప్రజలు కూడా సహాయ సహకారాలు అందించాలని సర్పంచ్ భరత్ బాబు కోరారు గ్రామ ప్రజలు వాకింగ్కు ఇబ్బంది కలకూడదని దృఢ సంకల్పంతో సాయిబాబా గుడి చెరువు వెంబడి వాకింగ్ ట్రాక్ నిర్మించామని రోజువారి వాకింగ్ చేసే ప్రజలు ఆ ట్రాక్ ను వినియోగించుకోవాలని భరత్ బాబు తెలిపారు.

## మొక్కలు పెంపకం సమాజానికి మేలు- సంఘం డైరీ ఇన్ చార్జి దివాకర్ రావు



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):–** తూర్పుగోదావరి జిల్లా సంగం డైరీ ఆధ్వర్యంలో అనపర్తిలో బిఎంసి లో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. మొక్కలను ప్లాంట్ ఇన్చార్జి టి దివాకర్ రావు నాటారు. మొక్కల వలన ఆరోగ్యానికి ఎంతోమేలు జరుగుతుందని ప్రతి ఒక్కరు కనీసం రెండు మొక్కలైనా నాటాలిఅన్నారు.

మొక్కలు నాటడంతో సమాజానికి మేలు జరుగుతుందని ఇన్ చార్జి దివాకర్ బాబు అన్నారు. అనపర్తి బి.ఎమ్.సి.లో మొక్కలు నాటేకార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలునాటడంవల్ల సమాజానికి మేలు చేకూర్చుతుందని కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల న్నారు. మానవ సమాజానికి ఆధారమైన మొక్కల పెంపకంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలల్సిన బాధ్యతను ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎమ్.సి ఇన్చార్జి టి.దివాకర్ రావు, సూపర్ వైజర్ కె.శివ ప్రకాష్,ప్లాంట్ ల్యాబ్ అసిస్టెంట్ కొండబాబు, ఆపరేటర్ కృపారావు, పాలు ఏజెంట్స్ శ్రీదేవి మిల్క్ డైరీ శ్రీనివాసరెడ్డి,ట్రాన్స్ పోర్ట్ ఓనర్స్, డ్రైవర్, పాల్గొన్నారు.

## మచిలీపట్టణం. పూణే జాతీయ రహదారి పై పశువులను అరికట్టాలి



జాతీయ రహరి పై భారీ వాహనం ఢీకొని మరణించిన పశువులు (ఫైల్ ఫోటో )



మచిలీపట్టణం - పూణే జాతీయ రహదారి నెం. 65

**మచిలీపట్టణం, (ఆర్ఎన్ఐ):–** మచిలీపట్టణం -పూణే నాలుగు లైన్ల జాతీయ రహదారి నెం.65 మీద విజయవాడ కు టోల్ గేట్ ఫీజ్ రానుపోను 200 చెల్లించి మరీ ప్రయానించే వాహన దారులకు హై స్పీడ్ రోడ్ పై ఫ్రీగా ప్రయానించే మాట దేముడెరుగు, ఆ రోడ్ మధ్యనున్న డివైడర్ పై నిత్యం మాకామ్ వుండే పశువులు ఎప్పుడు ఎటు వైపు దిగుతాయో ఏమిజరుగుతుందో అన్న అనుమానం తో వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని మరీ ప్రయాణ ము చేయాల్సిన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా ఈవిధంగా సంచరించే పశువుల బాధ జాతీయ రహదారి ప్రారంభం అయిన మచిలీపట్టణం నుండి గూడూరు, తరకటూరు,నిడుమోలు, జుజ్జవరం ల మధ్య ఎక్కువగా ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

కారణం గ్రామీణ ప్రాంతాలు రోడ్ కి ఇరువైపులా ఉండటంతో పెంపకందారులు వదిలివేసిన పశువులు డివైడర్ ని అవాసము గా చేసుకుని హటాత్తు గా రోడ్డుపైకి దూకటంతో అదే సమయంలో వచ్చే వాహనాలకు ప్రమాదం కల్గి కొన్నిసార్లు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

నిబంధన ప్రకారం హైస్పీడ్ రోడ్ కి ఇరుప్రక్కలా ఫెన్సింగ్ వేసి వాహనాల వేగానికి రక్షణ కల్పించాలి. మరి తాళం వేసి గొళ్ళెం మరిచినట్లు ఈ రహదారి నిర్వాహకులు గాని, పర్యవేక్షించాల్సిన జాతీయ రహదారుల అభివృద్ధి శాసఖ కాని ఫెన్సింగ్ వెయ్యటంలో సీతకన్ను వేసాయి. ఫలితంగా తరచూ ప్రమాధాలు జరిగి అమాయక ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కొన్నిసార్లు పశు వులుకూడా చనిపోయిన సంఘటనలు వున్నాయి.

కనుక వెంటనే ఈ రహరిని బి ఓ టి స్కీములో నిర్వహిస్తున్న వారు లీడర్ జాతీయ రహదారుల శాఖ బాధ్యత తీసుకుని పైన పేర్కొన్న ప్రాంతాల్లో పశువులను అరికట్టాలి ఎందుకు రోడ్ కి ఇరుప్రక్కలా ఫెన్సింగ్ ఏర్పాటు చెయ్యాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇలా ఉండగా జాతీయ రహదారులపై ప్రమాదాలకు దారితీసే వీధి పశువులు గణనీయమైన కారణం కావడంతో, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ ఏ ఐ ) జాతీయ రహదారుల వెంబడి 50 కిలోమీటర్ల క్రమం తప్పకుండా జంతు ఆశ్రయాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. హైవే అభివృద్ధి కోసం ఎంపిక చేయబడిన కన్సల్టెంట్ లేదా కన్సెషనర్ 100 జంతువులకు వసతి కల్పించే షెడ్లను ఏర్పాటు చేయడానికి అనువైన ప్రదేశాలను గుర్తిస్తారని ఎన్ హెచ్ ఏ ఐ వర్గసలు తెలిపాసయి.

ఈ సౌకర్యాన్ని పైలెట్ ప్రాజెక్టు గా ప్రస్తుతము వున్న లేదా ప్రతిపాదిత మార్గం కి చెందిన మిగులు భూమిలో ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

ఈ షెల్టర్లలో పశువుల దాణాను నిల్వ చేయడానికి తగినంత స్థలం, పశువైద్య సామాగ్రితో కూడిన వైద్య గది, పారా-మెడిక్ సిబ్బంది, దాణా ప్రాంతం, నీటి నిల్వ మరియు సరైన లైటింగ్ ఏర్పాట్లు ఉంటాయని కూడా సమాచారం.

ఏమైనా వచ్చే రోడ్ల సంగతి దేవుడెరుగు, వున్న రోడ్లపై విచ్చల విడిగా తిరువుతున్న పశువుల భారినుండి ప్రయాణికులను రక్షించే కంచె ఏర్పాటు చెయ్యాలి,లేదా జాతీయ రహదారుల నిభందనలు అతిక్రమంచి నిబంధనలు పాటించకపోతే బి ఓ టి కాంట్రాక్టు ని రద్దుచేయ్యాలని పలువురు కోరుతున్నారు.

## నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండుగలో ఆకట్టుకున్న నృత్య గీతాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):–** శ్రీ నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలలో భాగంగా 14 వ రోజు గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ గౌరీ అమృత వర్షిణి, శ్రీ నూకంబిక అమృత వర్షిని పెతకం శెట్టి సుజాత , కూచిపూడి నృత్య అకాడమీ కూర్మాన పాలెం డాక్టర్ పి. వెంకటరమణ నృత్య గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ నాయుడు, ఉడా రమేష్, కొణతాల రాజేంద్ర, చేబ్రోలు దుర్గా ప్రసాద్, పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో మమ్మల్ని భాగస్వామ్యం చేసిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కి అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ పీలా నాగ శీను, తిమ్మ పాత్రను చక్రవర్తి, రాష్ట్ర గవర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ,సకల గోవింద్, గండేపల్లి మురళి, దేవస్థాన ధర్మకర్తలు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ ప్రాణాలు కాపాడిన వీరుని చరిత్ర !!

భారత దేశంలో ప్రతి ఒక్క పౌరుడు ఇష్టపడే మనసున్న మహారాజు,

పులి గోళ్లతో "అఫ్జల్ ఖాన్" గుండెను చీల్చిన మహారాష్ట్ర పెద్దపులి,

ఆడవాళ్లను గౌరవించడం నేర్పిన అసలైన మగాడు. హిందూ ధర్మాన్ని కాపాడటానికి ఆఖరి శ్వాస వరకు పోరాడిన హైందవ ధర్మోద్ధారకుడు,

కేవలం రాజ్యాలను పాలించే రాజుగా మిగిలి పోకుండా ప్రజలను ప్రేమించి "ఛత్రపతి" గా ఎదిగిన జిజియా బాయి ముద్దు బిడ్డ!!

నేను ఎవరి గురించి చెబుతున్నానో మీకు ఈ పాటికే అర్థం అయ్యి ఉంటుంది. అతడే మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహరాజ్ ?

కానీ ఈ వ్యాసం ఛత్రపతి శివాజీ మహరాజ్ గురించి కాదు ఆ శివాజీ మహరాజ్ ప్రాణాలనే కాపాడిన ఒక యోదుడి గురించి.

రాజు కోసం, దేశం కోసం, ధర్మ కోసం - చావును సైతం దిక్కరించి, దేహమంత రక్తంతో తడిసి ముద్ద అయినా కూడా, రాజు ఛత్రపతి శివాజీ సురక్షితుడు అయ్యాడు అన్న వార్త తెలిశాకే ప్రాణాలను వదులతానని మొండి పట్టుతో యుద్ధం చేసిన వీరుడి గురించి. మన చరిత్ర మనం తెలుసుకోవడం ఈ గడ్డపై పుట్టిన మన అందరి బాధ్యత !!

**అది 1660 వ సంవత్సరం.**

బీజాపూర్ రాజ్యాన్ని వందల ఏళ్లుగా పాలిస్తున్న "ఆదిల్షాయులు" ఎన్నో సార్లు శివాజీ మీదకు యుద్ధానికి వెళ్లి చావు దెబ్బ తిని ఓడిపోయేవారు. అందుకే ఈ సారి ఆధీల్షాయులు "మొగల్ చక్రవర్తి ఔరంగజేబు" సహాయం తీసుకొని మరీ పన్హాలా కోటలో 600 మంది సైన్యంతో ఉన్న శివాజీని, శివాజీ కుడి భుజం, సర్వ సైన్యాధిపతి అయిన "బాజీ ప్రభు దేశ్పాండే" ని 10000 వేల సైన్యం తో కోటని చుట్టుముట్టి బంధీలను చేశారు. సరైన సమయం చూసి ఛత్రపతిని చంపేయాలని "ఆధీల్షాయులు" ఎదురు చూస్తున్నారు.

కేవలం 600 మంది సైన్యం. ఆ 600 మంది సైన్యం, 10000 మందితో పోరాడి యుద్ధం గెలవడం అసాధ్యం అని శివాజీకి తెలుసు కాబట్టి అక్కడి నుండి తప్పించుకోవడం ఒక్కటే శివాజీకి ఉన్న మార్గం. కానీ 10000 మంది నుండి తప్పించుకోవడం కూడా అంత సులువైన పని కాదు, పన్హాలా కోటలో ఉన్న ధాన్య శాలలో ఉన్న మొత్తం ధాన్యం ఖాళీ ఐతే ఆధీల్షాయులలోని సైన్యం కొంతభాగం ఆహారం సేకరించుటకు వెళ్తుంది. అప్పుడు తప్పించుకోవడం సులువుగా ఉంటుందని శివాజీ ఆదేశించారు. కొన్ని నెలలు గడిచాయి పన్హాల కోటలోని ఆహారం దాన్యగారం లోని ధాన్యం అన్నీ ఖాళీ అయిపోయాయి.

ఇప్పుడు 10000 మందికి ఆహారం కావాలి కాబట్టి ఆధీల్షాయుల సైన్యం లోని కొంతభాగం ఆహారం కోసం మరో దేశానికి బయలుదేరారు. ఛత్రపతి శివాజీ తప్పించుకొనే సమయం అస్సన్నమైనది. పన్హలా కోట నుండి "రంగీ నారాయణ్" అనే మరాఠా నాయకుడు పాలిస్తున్న "విశాల్ఘట్ కోటకు" వెళ్ళాలి అని శివాజీ నిర్ణయించుకున్నాడు.

13 జులై 1660 వర్షాకాలం. అమవాస్యకి దగ్గరలో వెన్నెల కాంతి బాగా తక్కువ ఉన్న ఒక రాత్రి, ఛత్రపతి శివాజీ - బాజీ ప్రభువులతో పాటు 600 మంది సైనికులు "విశాల్ఘట్" కు అడవి మార్గం గుండా ప్రయాణించటానికి సిద్ధంగా ఉన్నారు.

సైన్యం లో శివాజీ మహారాజు పోలికలతో ఉండే "శివకాశీ" అనే ఒక సైనికుడిని శివాజీ ధరించే దుస్తులు నగలు తొడిగి అచ్చుగుద్దినటట్లుగా శివాజీ మహారాజు లాగా తయారు చేసి ఆధీల్షాయి సైన్యానికి కనపడే విధంగా 10 మంది సైనికులతో పంపించారు.

ఛత్రపతి శివాజీ వేషంలో ఉన్న శివకాశీ ని చూసి శివాజీ నే తప్పించుకుంటున్నాడు అనుకుని ఆదిల్షాయిల సైన్యాధిపతి తన సైన్యం అంతటినీ పిలిపించాడు. ఇదే అదును చూసి ఆదిల్షాయిల సైన్యం మొత్తం శివకాశీ దగ్గరకు వెళ్లినప్పుడు, విశాల్ఘట్ వైపుకు అడవి మార్గం గుండా అతి వేగంగా బయలు దేరారు శివాజీ అతని సైనికులు.

వర్షాల తాకిడికి అడవిగుండా ముళ్లకంపలు చెత్తా చెదారం కొట్టుకొచ్చాయి, నడిచే మార్గం అంతా బురద ముళ్ల పొదలతో భయంకరంగా ఉంది.



కానీ అక్కడ ఉన్న 600 మందికీ ఒక్కటే లక్ష్యం ఛత్రపతి శివాజీని విశాల్ఘట్ కు చేర్చటం. ఆ 600 కి ఉన్న ధైర్యం కూడా ఒక్కడే అతడే బాజీ ప్రభు దేశ్పాండే.!!

బాజీ ఉన్నంత వరకు తమను ఎవరూ ఏమి చేయలేరు అనే నమ్మకం తో అడుగులు ముందుకు వేస్తున్నారు. ఆదిల్షాయిల సైన్యాధిపతి పట్టుకున్నది శివాజీ మహారాజు ను కాదని మారువేషంలో ఉన్న శివకాశీ అని తెలుసుకోటానికి ఎక్కువ సమయం పట్టలేదు.

శివకాశీ ని అక్కడికక్కడే నరికి చంపి 8000 మంది సైన్యాన్ని శివాజీ వెనుక తరముకుంటు వెళ్లి శివాజీ ని బంధించి తీసుకురమ్మని ఆదేశించాడు. తెల్లవారే సమయానికి "గోడ్కింగ్" అనే ఇరుకైన పర్వత ప్రాంతంలో విశ్రాంతి తీసుకొంటున్న శివాజీ సైన్యం, ఆదిల్షాయుల సైన్యం సమీపిస్తుందని తెలుసుకొని ఆశ్చర్యపోతారు. ఆదిల్షాయిల సైన్యానికి చిక్కకుండా వేగంగా విశాల్ఘట్ కి చేరటం అసాధ్యం.

ఎందుకంటే ఆ సమయం లో ఛత్రపతి శివాజీ సైన్యం వద్ద ఒక్క గుళ్ళం కూడా లేదు, కానీ సగం ఆదిల్షాయిల సైన్యం వద్ద గుఱ్ఱలు ఉన్నాయి. అక్కడే యుద్ధం చేసి ఆదిల్షాయిల సైన్యాన్ని ఓడించటం జరగని పని.

8000 మంది సైన్యం తో 600 మంది ఎంత భయంకరంగా పోరాడినా గెలవడం మాత్రం అసాధ్యం. ఇప్పుడు ఛత్రపతి సైన్యానికి ఉన్న ఒకే ఒక్క దారిని బాజీ ప్రభువు రాజుతో వివరించాడు.

గోడ్కింగ్ చాలా ఇరుకైన ప్రాంతం ఈ దారిగుండా సైన్యం ఒకేసారి ఎక్కువ మందితో దాటలేదు.

సైన్యం లో సగం మందిని అంటే సరిగ్గా 300 మందితో నేను గోడ్కింగ్ కు అడ్డుగా నిలబడి ఆదిల్షాయిల సైన్యం తో పోరాడుతాను. ఒకేసారి ఎక్కువ మంది సైనికులు ఈ దారిగుండా రాలేరు కాబట్టి తక్కువలో తక్కువ రెండు మూడు గంటల వరకు నేను ఆదిల్షాయిలను ఆపగలను. ఈ సమయం లో మిగిలిన 300 మంది సైన్యం తమ ప్రాణాలతో ఛత్రపతిని కాపాడుకుంటూ "విశాల్ఘట్" కు చేర్చండి. శివాజీ మహారాజు సురక్షితంగా విశాల్ఘట్ కు చేరుకోగానే అక్కడ ఉన్న ఫిరంగులను 5 సార్లు పేల్చండి.

ఫిరంగులు శబ్దం మహారాజు సురక్షితంగా విశాల్ఘట్ కు చేరారు అని నాకు సంకేతం అని పథకాన్ని వివరించాడు. మరో దారి లేక అందరూ ఈ పథకాన్నే ఒప్పుకున్నారు.

300 మంది సైన్యం తో శివాజీ మహారాజు విశాల్ఘట్ కు బయలు దేరాడు. మిగిలిన 300 మంది సైన్యం తో బాజీ ప్రభువు యుద్ధానికి సిద్ధంగా నిలబడ్డాడు. ఆదిల్షాయిల సైన్యం గోడ్కింగ్ కు చేరుకుంది. యుద్ధం మొదలు అయ్యింది. అరటి చెట్లను నరికినంత సులువుగా ఆదిల్షాయిలను నరికేస్తున్నారు బాజీప్రభు అతని సైన్యం. ఇరుకైన కొండ ప్రాంతం అవ్వటం తో శివాజీ మహారాజుకు తప్పించుకోడానికి ఎక్కువ సమయం దొరికినా అవతలి వైపు ఉన్నది 8000 మంది సైన్యం 300 మంది బాజీ ప్రభు సైన్యం ఒక్క నిమిషం కూడా కత్తి తిప్పటం ఆపటం లేదు. సమయం గడిచేకొద్దీ బాజీ ప్రభు సైన్యం తరిగిపోతుంది , కానీ బాజీ ప్రభువు వైపు ఒక్క సైనికుడు చనిపోతే ఆదిల్షాయిల వైపు 20 నుండి 30 మంది చనిపోతున్నారు . సుమారు 4 గంటలు గడిచే సరికి 8000 మంది ఆదిల్షాయిల సైన్యం లో 5000 మంది మరణించారు. కానీ బాజీ ప్రభు సైన్యం లో దాదాపు అందరు మరణించారు.

బాజీ ప్రభు తో పాటు అతికొద్ది మంది మాత్రమే మిగిలారు. కేవలం 300 మంది సైన్యం తో 5000 మందిని చంపటం చరిత్రలో అదే మొట్టమొదటి సారి ఒంట్లో ఉన్న ప్రతి అవయవం మీద కత్తి వేట్లతో దేహం అంతా గాయాలతో రక్తంతో తడిసి ముద్ద అయ్యి ఎర్రగా మండుతున్న అగ్నిగోళంలా ఉన్న బాజీ ప్రభువును చూసి "మనీషా - రాక్షసుడా" అని భయపడ్డారు ఆదిల్షాయిలు. నిజానికి బాజీ ప్రభువు కి తగిలిన గాయాలు కత్తి పోట్లలో పావు వంతు తగిలినా ఒక మనిషి మరణిస్తాడు , కానీ అగ్ని పర్వతం నుండి లావా ఉబికినట్టు బాజీ ప్రభువుల అవయువాల నుండి రక్తం ప్రవహిస్తున్నా. అతని చేయి మాత్రం ఇంకా కత్తి తిప్పుతూనే ఉంది.

తనరాజు "ఛత్రపతి శివాజీ మహరాజ్" విశాల్ఘట్ కు చేరే వరకు తన ప్రాణాలు వదిలే సమస్యే లేదని ఒక చేతితో మృత్యువుని ఆపుతూ.. మరో చేతితో యుద్ధం చేస్తున్నాడు బాజీ ప్రభు దేశ్పాండే. చావుని పూర్తిగా ధిక్కరించి ఊపిరికి ఊపిరి పోగు చేసుకొని యుద్ధం చేస్తూనే ఉన్న బాజీ ప్రభువు చెవులు యుద్ధం మొదలైన నాలుగు గంటల తరువాత ఫిరంగి పేలుడు శబ్దాలు విన్నాయి.

"నా రాజుని కాపాడుకున్నాను అనే చిరునవ్వు పెదవుల పైకి వచ్చేలోపు దేశ ప్రజలను రక్షించాను అనే గర్వం కళ్ళలోకి చేరే లోపు అతని చెయ్యి కత్తిని వదిలేసింది".

కాళ్లు నేలకు ఒరిగాయి. కళ్ళు ఆకాశాన్ని చూస్తూ. ప్రాణం శరీరాన్ని వదిలింది. చరిత్ర "కనీ వినీ" ఎరగని యుద్ధం చేసి, కేవలం 300 మందితో 8000 మందిని అడ్డుకొని మృత్యువునే వాయిదా వేసిన బాజీ ప్రభువు త్యాగానికి ఛత్రపతి శివాజీ మహారాజు కన్నీటి నివాళి అర్పించి "గోడ్కింగ్ ప్రదేశాన్ని పావన్ కింగ్" అంటే పవిత్రమైమ ప్రదేశం అని ప్రకటించాడు. ఆ తరువాత బాజీ ప్రభువుల పిల్లలను తన సొంత పిల్లలుగా పెంచి పోషించాడు ఛత్రపతి శివాజీ..!!

ఈ రోజు ఈ దేశం లో హిందుత్వం ఇంకా బతికి ఉంది అంటే కారణం ఇటువంటి మహా వీరులు మనకోసం తమ ప్రాణాలను అర్పించటమే .

జై భవానీ !

జై శివాజీ !

జై హింద్ !!

సర్వే జనాః సుఖినోభవంతు

# క్రీడా సమాచారమ్

## కేఎల్ 'సంబరాలు' వెనక కారణమదేనా?



ఇంటర్నెట్ డెస్క్: ఒకప్పుడు తాను అరంగేట్రం చేసిన జట్టు పైనే ప్రత్యర్థిగా బరిలోకి దిగి కీలక ఇన్నింగ్స్ ఆడిన కేఎల్ రాహుల్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిపోయాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై దిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించింది. దీనివెనక 'బెంగళూరు' ప్లేయర్ కేఎల్ రాహుల్ (93లి) కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ గెలిచిన అనంతరం కేఎల్ వ్యవహరించిన తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విన్నింగ్ షాట్ కొట్టిన తర్వాత 'ఇది నా గ్రౌండ్' అంటూ బ్యాట్‌తో సంబరాలు చేసుకున్నాడు. ఛాతి మీద విజయనాదం చేస్తూ సైగలు చేశాడు. ఆ సమయంలో కాస్త అగ్రెసివ్‌గానే కనిపించాడు. మ్యాచ్ అనంతరం తాను ఇక్కడ చాలా ఏళ్లు క్రికెట్ ఆడినట్లు కేఎల్ వివరణ ఇచ్చాడు.

అయితే, కేఎల్ ఇలా దూకుడుగా ప్రవర్తించడానికి చాలా కారణాలు ఉన్నాయనేది అభిమానుల మాట. మళ్లీ తన 'సొంత' జట్టుకు వద్దామని భావించినా కుదరకపోవడం వల్లే రివేంజ్ తీర్చుకున్నట్లు అనిపిస్తోందని అభిమానులు భావిస్తున్నారు. ఎందుకంటే కేఎల్ అరంగేట్రం చేసిందే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున కావడం గమనార్హం. 2013-16 సీజన్లలో ఆర్సీబీకి ఆడాడు. ఆ తర్వాత సన్‌రైజర్స్ (2014-15)కు ప్రాతినిధ్యం వహించాడు. పంజాబ్ కింగ్స్ (2018-21), లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు (2022-24) సారథిగా వ్యవహరించాడు. ఇప్పుడు దిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి వచ్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో అద్భుతమైన ఫామ్‌ను కనబరిచిన రాహుల్ ఇప్పుడూ అదే జోరును కొనసాగిస్తున్నాడు. ఇటీవలే తండ్రైన కేఎల్ ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో ఆడలేదు. గత మూడు మ్యాచుల్లోనే 185 పరుగులు రాబట్టాడు.

**కెప్టెన్సీ ఇస్తారని ప్రచారం సాగినా..**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఈ సీజన్ ముందు సారథ్యం సమస్యగా మారింది. మెగా వేలానికి ముందు ఫాఫ్ డుప్లెసిస్‌ను ఆర్సీబీ రిటైన్ చేసుకోలేదు. దీంతో స్టార్ బ్యాటర్లు రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌లో ఒకరిని వేలంలో దక్కించుకొని సారథ్యం అప్పగిస్తారని అంతా భావించారు. మరీ ముఖ్యంగా 'లోకల్ బాయ్' కేఎల్ రాహుల్‌ని తీసుకుంటారని అంచనా వేశారు. కేఎల్ కూడా తాను ఆర్సీబీకి వెళ్లేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పలు సందర్భాల్లో తన మనసులోని మాట వెల్లడించాడు. కానీ, ఆర్సీబీ మాత్రం కేఎల్‌ను తీసుకోలేదు. బెంగళూరు కెప్టెన్సీని కూడా రజత్ పటీదార్‌కు ఇచ్చింది. ఇప్పుడు కేఎల్‌కు అదే గుర్తుకొచ్చి ఉంటుందని క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు.

## ఐపీఎల్‌లో సూపర్ రికార్డు.. ప్రత్యర్థులపై దిల్లీ దూకుడు



చెన్నై సూపర్ కింగ్స్‌కు ఉన్న క్రేజ్ లేదు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఉన్నంత ఫ్యాన్ బేస్ లేదు. ముంబయి ఇండియన్స్‌లా 'స్టార్ల' టీమ్ కాదు. సన్‌రైజర్స్ మాదిరి 'హిట్టర్లూ' లేరు. అయినా.. వీరెవరికీ సాధ్యం కాని రికార్డు ఆ జట్టు సొంతం. నాలుగు మ్యాచుల్లో నాలుగు విజయాలు సాధించిన తొలి టీమ్‌గా ఘనత. ఆ జట్టు మరేదో కాదు దిల్లీ క్యాపిటల్స్. ఈ దూకుడు వెనక 'సైలెంట్' హీరోలెందరో..!

ఐపీఎల్ 2025 సీజన్‌లో కేవలం రెండు టీమ్‌లు మాత్రమే ఇప్పటివరకు ఐదు మ్యాచులు ఆడలేదు. దిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ నాలుగేసి మ్యాచులు ఆడాయి. పంజాబ్‌కు ఒక ఓటమి ఎదురైంది. కానీ, దిల్లీ మాత్రం అజేయంగా కొనసాగుతోంది. గత మూడు సీజన్లలో ఒక్కసారి కూడా ప్లేఆఫ్స్‌కు డీసీ చేరుకోలేదు. ఈసారి ఇలాగే విజయాలతో కొనసాగితే మాత్రం అగ్రస్థానంతోనే 'ప్లేఆఫ్స్'కు వెళ్లే జట్టు దిల్లీనే అవుతుందనడంలో సందేహం లేదు. డేవిడ్ వార్నర్, రిషభ్ పంత్ టీమ్‌ను నడిపించినా లీగ్ స్టేజికే పరిమితం కావాల్సి ఉంది. 2020లోనే ఫైనల్‌కు చేరి రన్నరప్‌గా నిలిచింది. అప్పుడు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్. ఆ తర్వాత అయ్యర్‌ను వదిలేసుకున్న దిల్లీ.. గత మెగా వేలానికి ముందు రిషభ్ పంత్‌ను రిటైన్ చేసుకోలేదు.

**తొలి టీమ్‌గా..**

రిషభ్ పంత్‌ను మళ్లీ ఐపీఎల్ వేలంలో తీసుకుని సారథ్యం అప్పగిస్తారని తొలుత వార్తలు వచ్చాయి. కానీ, అలా జరగలేదు. లఖ్‌నవూ నుంచి బయటకొచ్చిన కేఎల్ రాహుల్‌ను దిల్లీ వేలంలో దక్కించుకుంది. అతడు సారథ్యానికి దూరంగా ఉంటానని మేనేజ్‌మెంట్‌కు చెప్పడంతో యువ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను అదృష్టం వరించింది. కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. పెద్దగా హడావుడి చేసే టైప్ కాదు. నిశ్శబ్దంగా ఉంటూ తన వ్యూహాలను అమలుచేసేస్తాడు. తొలుత ఈ జట్టును చూసి కనీసం పోటీనిస్తుందా? అనే అనుమానాలు అభిమానుల్లో నెలకొన్నాయి. వాటన్నింటిని పటాపంచలు చేస్తూ అద్భుతాలు సృష్టించింది. 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో వరుసగా నాలుగు మ్యాచులు గెలిచిన తొలి టీమ్‌గా డీసీ రికార్డు సృష్టించింది. అక్షర్, కుల్‌దీప్, ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పోరెల్‌ను అట్టిపెట్టుకున్న దిల్లీ మెగా వేలంలో కీలక ప్లేయర్లను తీసుకొని అన్ని విభాగాలను బలంగా తయారుచేసింది.

**కుర్రాళ్లపై నమ్మకం ఉంచి..**

దిల్లీ క్యాపిటల్స్ ఇప్పటివరకు లఖ్‌నవూ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరుపై విజయాలను సాధించింది. ఇవన్నీ బలమైన జట్లే. సొంత మైదానాల్లో ఇప్పుడు పెద్ద టీమ్‌లకే కలిసిరావడం లేదు. కానీ, దిల్లీకి మాత్రం వైజాగ్ (దిల్లీ రెండో హోం గ్రౌండ్)లో విజయాలు దక్కాయి. లఖ్‌నవూపై చివరివరకూ పోరాడి గెలిచిన తీరు ప్రశంసనీయం. కుర్రాళ్లు అశుతోష్ శర్మ, విప్రజ్‌పై మేనేజ్‌మెంట్ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయలేదు. విప్రజ్ బ్యాటింగ్‌లోనే కాకుండా బౌలింగ్‌లోనూ జట్టుకు అండగా నిలుస్తున్నాడు. గత సీజన్ వరకు బెంగళూరు అదిరిపోయే ఆరంభాలు ఇచ్చిన ఫాఫ్ డుప్లెసిస్ ఇప్పుడు దిల్లీకి సానుకూలాంశంగా మారిపోయాడు. 40ం వయసులోనూ దూకుడుగా ఆడేస్తూ పరుగులు రాబట్టేస్తున్నాడు.

**కేఎల్ ఉండగా..**

భారీ అంచనాలు లేకపోవడంతో కెప్టెన్ అక్షర్ పటేల్‌పై ఒత్తిడి లేదు. ఇదే అతడికి ప్లస్ పాయింట్. ఎవరినీ మెప్పించాల్సిన అవసరం లేదు. ఫలితం ఎలా ఉన్నా మద్దతుగా నిలిచే మేనేజ్‌మెంట్. భారత టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా వచ్చాక అక్షర్‌కు దిల్లీ సారథ్యం దక్కడంతో తానేంటో నిరూపించుకోవాలని తప్ప మరో టెన్షన్ లేదు. ఇందులో ఇప్పటివరకైతే అక్షర్ సక్సెస్ అయ్యాడు. తన బౌలర్లను ఎలా వినియోగించుకోవాలో బాగా తెలిసిన సారథి. సీనియర్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను ప్రయోగించి ప్రత్యర్థులపై ఒత్తిడి తెస్తోన్న తీరు బాగుంది. స్వయంగా బౌలర్ కావడంతో పవర్‌ప్లేలో రిస్క్ తీసుకోవాలంటే అక్షర్ పటేలే ముందుడుగు వేస్తున్నాడు. అత్యధిక వికెట్లు తీసిన టాప్ -10 బౌలర్ల జాబితాలో స్టార్క్ (9), కుల్‌దీప్ (8) కొనసాగుతున్నాడు. ఇక అక్షర్ వెన్నంటే ఉంటూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ కేఎల్ రాహుల్ ఛాంపియన్స్ ట్రోఫీ సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తాజాగా బెంగళూరుపై ఆడిన తీరే దీనికి నిదర్శనం. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అదరగొట్టేయడంతో దిల్లీ ఫ్యాన్స్ జోష్ మీదున్నారు.

## సెంచరీ కొట్టినా.. ధోనీతో మాట్లాడలేకపోయా: ప్రియాంశ్ ఆర్య



ఇంటర్నెట్ డెస్క్: సెంచరీ సాధించినా.. ధోనీతో మాట్లాడే అవకాశం రాకపోవడమే తనను బాధించిందని యువ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య అన్నాడు. ఐపీఎల్ లో ఆడిన నాలుగో మ్యాచ్‌లోనే సెంచరీ బాదేసి అందరి దృష్టిని ఆకర్షించాడు యువ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య ఇటీవల చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ ఆటగాడు శతకంతో పరుగుల మోత మోగించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ మ్యాచ్ తర్వాత ధోనీతో మాట్లాడాలని అనుకున్నప్పటికీ.. తనకు ఆ అవకాశం దొరకలేదని చెప్పాడు. అదొక్కటే తనను బాధిస్తోందని అన్నాడు.

"ధోనీ లాంటి గొప్ప ఆటగాళ్లపై ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి అవకాశం చాలా కొద్ది మందికి మాత్రమే వస్తుంది. వికెట్ల వెనుక ధోనీ సర్ ఉన్నప్పుడు ఒత్తిడి సహజమే. ఇక, అశ్విన్ లాంటి లెజెండరీ బౌలర్లను ఎదుర్కొన్నప్పుడు టెన్షన్ ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో సెంచరీ సాధించడం చాలా ఆనందంగా ఉంది. మ్యాచ్ తర్వాత ధోనీ సర్‌ని కలిసి మాట్లాడాలనుకున్నా. కానీ, నేను ఇంటర్వ్యూ ముగించుకునేసరికి ఆయన వెళ్లిపోయారు. ఆయనతో మాట్లాడలేకపోయా" అని ప్రియాంశ్ ఆర్య చెప్పాడు.

ఈ సందర్భంగా పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గురించి మాట్లాడుతూ.. "చెన్నైతో మ్యాచ్ కంటే ముందు రాజస్థాన్‌తో ఆడుతున్నప్పుడు తొలి బంతికే ఔట్ అయ్యా. దానికి చాలా బాధపడ్డా. కానీ పాంటింగ్ సర్, అయ్యర్ దాని గురించి ఒక్కసారి కూడా విమర్శించలేదు. బ్యాటింగ్ ఎలా మెరుగుపర్చుకోవాలో చెప్పి నాలో స్ఫూర్తి నింపారు" అని తెలిపాడు.

ఏప్రిల్ 8న జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ యువ ఓపెనర్.. చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఎనిమిది ఓవర్లలోనే ఐదు వికెట్లు పడిపోయినా.. ఏ మాత్రం భయపడకుండా క్రీజులో పాతుకుపోయాడు. కేవలం 39 బంతుల్లోనే శతకం సాధించి.. జట్టుకు అనూహ్య విజయాన్ని అందించాడు. దీంతో అతడి పేరు నెట్టింట మార్మోగింది.

## దేశాభివృద్ధిలో బ్రహ్మకుమారీల పాత్ర ప్రశంసనీయం

- రాజయోగ మెడిటేషన్‌తో మానసిక ప్రశాంతత
- దాదీ రతన్ మోహినీ మృతిపట్ల ఘన నివాళులు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ప్రపంచ వ్యాప్తంగా సమాజాభివృద్ధి కోసం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ అందిస్తున్న సేవలు అత్యంత ప్రశంసనీయమని ఏపీ ఈపీడీసీఎల్ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.రమేష్ ప్రసాద్ కొనియాడారు. ఇక్కడ బాలయ్యశాస్త్రిలేవుట్ వద్ద ఉన్న సింధూర గెస్ట్ హౌస్‌లో జర్నలిస్టులకు వత్తిడిని అధిగమించేందుకు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజం కోసం బ్రహ్మకుమారీస్ నిరంతరం అనేక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఇక జర్నలిస్టులకు ఇటువంటి సెమినార్లు నిర్వహించడం ఎంతో ఉపయుక్తమన్నారు. కొవిడ్‌లో సైతం వారు అందించిన మానసిక స్థైర్యం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. గౌరవ అతిధిగా హాజరైన మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా ఎంతో కొంత మందికి తగిన సాయం చేయాలన్నారు. మనిషి ఉన్నంతవరకే అంతా నాది అని భావిస్తారని, కానీ ఎప్పుడు ఎవరు ఏలా ఉంటారన్నది ఏ ఒక్కరూ చెప్పలేరన్నారు. విశాఖలో బ్రహ్మకుమారీస్ ఎంతో మందికి తమ శక్తిమేరకు ఆధ్యాత్మిక భక్తి భావాలు పెంపొందించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తునే ఉన్నామన్నారు. ఇక ప్రభుత్వ పరంగా కూడా వారికి పలు సంక్షేమ కార్యక్రమాలు అందే విధంగా తమ ప్రయత్నాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు బికె రామేశ్వరి మాట్లాడుతూ జర్నలిస్టులు ఆహోరాత్రులు సమాజం కోసం కష్టపడి పనిచేస్తున్నారన్నారు. అయితే ఒక వైపు వృత్తిధర్మం పాటిస్తూనే మరో వైపు తమ కుటుంబాలను అధిగమించాలంటే అందుకు ఆధ్యాత్మిక భక్తిభావంతో పాటు, మానసిక ప్రశాంతత ఎంతో అవసరమన్నారు. రాజయోగ మెడిటేషన్ ద్వారా జర్నలిస్టులు వత్తిడిని అధిగమించవచ్చునన్నారు. తాము నిరంతరం మెడిటేషన్‌కు సంబంధించిన తరగుతులను అన్ని వర్గాలకు వివరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రముఖ కోరియోగ్రాఫర్, సీనియర్ పాత్రికేయులు ఆర్. నాగరాజు పట్నాయక్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో శాంతినగర్ శాఖ నిర్వాహకురాలు లలితతో పాటు, పెద్ద ఎత్తున జర్నలిస్టులు, బ్రహ్మకుమారీస్ పాల్గొన్నారు.

**దాదీ రతన్ మోహినీకి ఘన నివాళులు**

బ్రహ్మకుమారీస్ గ్లోబల్ సెంటర్ల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ దాదీ రతన్ మోహినీ మృతి అత్యంత విచారకరమని అతిధులంతా సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాదీ చిత్రపటం వద్ద దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి వీరంతా ఘన నివాళులు అర్పించారు. సమాజానికి శాంతి, మానవతా విలువలతో పాటు ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటిచెప్పిన రతన్ మోహినీ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తారన్నారు.

## జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు

### జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కి సంబంధించి 20 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరం లో సిపిలు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, చీఫ్ సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి జివిఎంసి కి సంబంధించి 20 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 04, 3వ జోన్ కు 02, 5వ జోన్ కు 11, 6వ జోన్ కు 01, 7వ జోన్ కు 01, 8వ జోన్ కు 01 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

## హెలికాప్టర్ ప్రమాదానికి పెంగ్విన్ కారణం




ఇంటర్నెట్‌డెస్క్: ఓ పెంగ్విన్ హెలికాప్టర్ ప్రమాదానికి కారణమైంది. ఈ ఘటన జనవరిలో దక్షిణాఫ్రికాలో చోటుచేసుకోగా.. దర్యాప్తు వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈ ఏడాది జనవరి 19న ఈస్టర్న్ కేప్ ప్రాంతంలోని బర్డ్స్ ద్వీపం నుంచి 'రాబిన్సన్ ఆర్44 రావెన్ 2' అనే హెలికాప్టర్ పైకి ఎగిరింది. అది 50 అడుగుల ఎత్తుకు లేవగానే.. ఒక్కసారిగా అదుపుతప్పి నేలను ఢీకొంది. ఈ ప్రమాదం నుంచి అందులోని ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. దక్షిణాఫ్రికా సివిల్ ఏవియేషన్ అథారిటీ దీనిపై దర్యాప్తు చేపట్టింది.

ఈ నాలుగు సీట్ల హెలికాప్టర్‌లో పెట్టెలో ఉంచిన పెంగ్విన్ ఈ ప్రమాదానికి కారణమని దర్యాప్తు బృందం తేల్చింది. దానిని సురక్షిత పద్ధతుల్లో ఉంచకపోవడంతోనే ఇదంతా జరిగిందని చెప్పింది. ఈ విమానంలో పైలట్ , ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. వీరిలో ఒక నిపుణుడు పెంగ్విన్‌ను పోర్ట్ ఎలిజబెత్‌కు తరలించాలని కోరడంతో.. పైలట్ కూడా రిస్క్‌ను అంచనావేయకుండా అంగీకరించి దానిని తీసుకున్నాడు.

ఆ పెంగ్విన్‌ను ఓ కార్డుబోర్డ్ బాక్స్‌లో ఉంచి హెలికాప్టర్‌లో పైలట్ పక్కనే ఉన్న వ్యక్తి ఒడిలో ఉంచారు. ఆ లోహ విహంగం 50 అడుగుల ఎత్తు ఎగరగానే.. ఆ బాక్స్ ఒక్కసారిగా పైలట్ సైక్లిక్ పిచ్ కంట్రోల్ లివర్‌పై పడింది. దీంతో హెలికాప్టర్ అదుపుతప్పి.. దాని రెక్కలు నేలను తాకడంతో అది కూలిపోయింది. తగిన ఏర్పాట్లు లేకుండా పెంగ్విన్‌ను హెలికాప్టర్లలో తరలించడం సరైన చర్య కాదని దక్షిణాఫ్రికా సీఏఏ తన నివేదికలో పేర్కొంది. దీనికి తోడు పైలట్ కూడా దానిని కార్డుబోర్డు బాక్స్‌లో తరలించి.. ముప్పును అంచనావేయడాన్ని విస్మరించాడని పేర్కొంది.

## డ్రోన్ల వినియోగంలో సెంచూరియన్ యూనివర్శిటీ సహకరించాలి



విజయనగరం, (విశాఖ సమాచారమ్):- వ్యవసాయం, ఉద్యాన వనాల అభివృద్ధి లో డ్రోన్ల వినియోగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరారు. శుక్రవారం సెంచూరియన్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు కలెక్టర్ తో భేటి అయ్యారు. సెంచురియన్ యూనివర్సిటీ లో చేపడుతున్న కోర్సుల వివరాలను, స్కిల్ డెవలప్మెంట్ శిక్షణలను గురించి ఛాన్సలర్ కలెక్టర్ కు వివరించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి తాము సిద్దంగా ఉన్నామని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో అమలు చేస్తోన్న కోర్సులు, నైపుణ్య శిక్షణలు, సీడాప్ ఒప్పందం గురించి వివరించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్, పారా మెడికల్, అగ్రికల్చర్, మేనేజ్మెంట్ కోర్సులు నిర్వహిస్తోన్నమని వాటితోపాటు యువతకు శిక్షణనిచ్చేందుకు అన్ని రకాల నైపుణ్య శిక్షణలు ఇవ్వడానికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ త్వరలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా యువతకు నైపుణ్య శిక్షణ కోర్సులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే డ్రోన్లతో వ్యవసాయం ఇతర రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ తాను త్వరలో విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తానని చెప్పారు. వ్యవసాయం లో, ప్రస్తుతం మామిడి పంట ఉన్నందున తెగులు నివారణ కు డ్రోన్ల ద్వారా కృషి చేయాలని కోరారు. అనంతరం డిఆర్ఓ శ్రీనివాస మూర్తిని కలిశారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com